12-12-2025

# విశాల భారతి

తెలుగు దినపత్రిక

www.vishalabharati.com
epaper.vishalabharati.com

శుక్రవారం, హైదరాబాద్ సంపుటి:3 సంచిక: 342




# ఫుట్‌బాల్ ఆడుతున్నా రండి..!

## సీఎం రేవంత్ రెడ్డి దిల్లీలో కాంగ్రెస్ అగ్ర నాయకులను కలిశారు

- గ్లోబల్ సమిట్ ద్వారా వచ్చిన పెట్టుబడులు గురించి చర్చించారు
- ఈ సందర్భంగా మెస్సీతో జరిగే ఫుట్‌బాల్ మ్యాచ్‌కు ఆహ్వానించారు
- సుమారు 2వేల మందితో భారీ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు
- రాష్ట్ర నిధులు, పెండింగ్ ప్రాజెక్టులు వంటి కీలక అంశాలపై చర్చించారు
- సమిట్ ద్వారా రాష్ట్రానికి రూ.5 లక్షల కోట్ల పైగా పెట్టుబడులు వచ్చాయి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

హైదరాబాద్‌లో జరగబోయే మెస్సీ కార్యక్రమానికి కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను ఆహ్వానించినట్టు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. దిల్లీ పర్యటన ముగించుకొని హైదరాబాద్ బయలుదేరే ముందు పార్లమెంట్ ఆవరణలో సీఎం మీడియాతో పలు విషయాలపై మాట్లాడారు. ఈ నెల 13న ప్రముఖ ఫుట్‌బాల్ దిగ్గజ క్రీడాకారుడు లియోనల్ మెస్సీ హైదరాబాద్‌కు వస్తున్నారని, ఓ ప్రముఖ సంస్థ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. తనను కూడా ఒక అతిథిగా మెస్సీ ఫుట్‌బాల్ మ్యాచ్‌కు పిలిచారని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి మెస్సీ ఫుట్‌బాల్ మ్యాచ్‌కు ఎలాంటి సంబంధం లేదని వెల్లడించారు. ప్రపంచంలోనే ప్రముఖ క్రీడాకారుడు మెస్సీ హైదరాబాద్‌కు వస్తున్నందున ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. దిల్లీలో కలిసిన పలువురు నాయకులను ఈ కార్యక్రమానికి రావాలని పిలిచినట్లు చెప్పారు. ఏఐసీసీ అగ్రనేతలను సీఎం రేవంత్ రెడ్డి కలిసిన సందర్భంలో ఈనెల 8, 9వ తేదీల్లో నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్ ద్వారా వచ్చిన పెట్టుబడులు గురించి చర్చించినట్లు సమాచారం. ఇవే కాకుండా తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ సరళి, అనుసరిస్తున్న ప్రణాళికల

మిగతా 4లో..

తెలంగాణ గ్రామ పంచాయతీ తొలి విడత ఎన్నికల ఫలితాలలో అధికార కాంగ్రెస్ పార్టీ హవా కొనసాగింది. సింహభాగం సర్పంచ్ పదవులను, వార్డు స్థానాలను గెలుచుకుని ఎన్నికల్లో కాంగ్రెస్ ఆధిపత్యం చాటింది. తొలి విడతలో 189మండలాలల్లోని 4236గ్రామ పంచాయతీలకు పోలింగ్ జరుగాల్సి ఉండగా..అందులో 395 సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. ఏకగ్రీవమైన వాటిలో 70శాతం వరకు అధికార కాంగ్రెస్ ఖాతాలోనే పడ్డాయి. ఇకపోతే గురువారం ఎన్నికలు జరిగిన 3,834పంచాయతీల సర్పంచ్ స్థానాల్లో మెజార్టీ సర్పంచ్ లను కాంగ్రెస్ హస్తగతం చేసుకుంది.

# పంచాయతీలు హస్తగతం

## పంచాయతీ తొలి విడత ఎన్నికల ఫలితాలలో కాంగ్రెస్ పార్టీ హవా

### సర్పంచ్ పదవులను, వార్డు స్థానాలను గెలుచుకుని ఆధిపత్యం

- ఇప్పటికే 395 సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి
- 33 జిల్లాల్లోనూ అధికార కాంగ్రెస్ పైచేయి సాధించింది
- రికార్డు స్థాయిలో 84.28శాతం పోలింగ్ నమోదైనట్లుగా వెల్లడి
- చాలా మంది గ్రామాభివృద్ధి కోణంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

రాష్ట్రంలో అధికార పార్టీగా ఉన్న కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపిస్తే.. గ్రామాల అభివృద్ధికి అవకాశం ఉంటుందన్న సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యేల ప్రచారంతో పాటు అధికార పార్టీగా ఉన్న వనరులు, అవకాశాల నేపథ్యంలో ఆ పార్టీ సర్పంచ్ ఎన్నికల్లో ఆధిపత్యాన్ని చాటుకుంది. 33జిల్లాల్లోనూ కాంగ్రెస్ పైచేయి సాధించింది. తెలంగాణ పంచాయతీ తొలి విడత ఎన్నికల్లో రికార్డు స్థాయిలో 84.28శాతం పోలింగ్ నమోదైనట్లుగా రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది.

ఏకగ్రీవ సర్పంచ్ లతో కలిపి తొలి విడతలో 4236సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు జరుగగా..వాటిలో ఇప్పటిదాక అందిన ఫలితాలలో కాంగ్రెస్ పార్టీ 2000కు పైగా సర్పంచ్ స్థానాలను కైవసం చేసుకుంది. బీఆర్ఎస్ పార్టీ 600కి పైగా సర్పంచ్ స్థానాలను సాధించింది. బీజేపీ సైతం 77స్థానాలలో గెలుపొందింది. ఇతరులు 145స్థానాల్లో గెలుపొందారు. పూర్తి స్థాయిలో ఫలితాలు వెలువడాల్సి ఉంది. ఎన్నికల్లో గెలిచిన సర్పంచ్ లు, వార్డు సభ్యుల అనుచరులు, పార్టీ శ్రేణులతో గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది.

ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ తనకున్న బలమైన కేడర్‌తో గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గట్టిగానే ఎదుర్కొందని చెప్పవచ్చు. గెలిచిన సర్పంచ్ స్థానాల సంఖ్యను పక్కన బెడితే ఎన్నికల్లో ఆ పార్టీ బలపరిచిన అభ్యర్థులు ఇచ్చిన పోటీ అనేక చోట్ల నువ్వా నేనా అన్నట్లుగా సాగడం గమనార్హం. ప్రతిపక్ష పార్టీగా అసెంబ్లీ ఎన్నికల్లో గ్రామీణ నియోజవర్గాల ఎమ్మెల్యేల స్థానాల్లో మెజార్టీ స్థానాలు కోల్పోయి అధికారాన్ని చేజార్చుకున్న బీఆర్ఎస్, పార్లమెంటు ఎన్నికల్లో జీరోకే పరిమితమైంది.

మిగతా 2లో..



## ఫోన్ ట్యాపింగ్ కేసులో బిగ్ షాక్

- ఫోన్ ట్యాపింగ్ కేసులో సుప్రీం కోర్టు కీలక తీర్పు వెల్లడించింది
- పోలీసుల ముందు సరండర్ కావాలని ధర్మాసనం ఆదేశించింది
- జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ ముందు హాజరు కావాలని స్పష్టం
- విచారణ సమయంలో ఎటువంటి టార్చర్ చేయద్దంటూ ఆదేశం
- 14 రోజుల విచారణకు వీలుకల్పించాలని వాదలనలు
- కీలక ఆధారాలు ధ్వంసం చేశారని ప్రభుత్వం ఆశ్రయించింది

02



## తెలంగాణ ఎంపీలకు మోడీ చివాట్లు

- తెలుగు రాష్ట్రాల బీజేపీ ఎంపీలకు ప్రధాని మోడీ క్లాస్
- ఏపీ బీజేపీ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండటం లేదన్న మోడీ
- వైసీపీ, జగన్ చేస్తున్న వ్యాఖ్యలకు గట్టిగా కౌంటర్ ఇవ్వాలని ఆదేశం
- తెలంగాణ బీజేపీ ఎంపీల పనితీరుపై అసంతృప్తి
- కనీసం ప్రతిపక్ష పాత్ర కూడా పోషించడం లేదని చివాట్లు
- మంచి టీమ్‌ను పెట్టుకుని సమర్థంగా ఎదుర్కోవడానికి సమస్యేంటని ఫైర్

02



## కవిత విషయంలో నో కాంప్రమైజ్

### కవిత విషయంలో నో కాంప్రమైజ్ అని ఇప్పటికే గ్రీన్ సిగ్నల్

- కాంగ్రెస్‌కంటే ఎక్కువగా తమనే టార్గెట్ చేస్తున్నట్టు బీఆర్ఎస్ ఫీలింగ్
- కవిత వెళ్ళిన ప్రతిచోట ఎమ్మెల్యేనో, మాజీ మంత్రో లక్ష్యం
- వాళ్ల గత వ్యవహారాలను చెప్పి ఏకిపారేస్తున్న కవిత
- మొదట్లో హరీష్‌రావుతోపాటు మాజీ మంత్రులను టార్గెట్
- తాజాగా బీఆర్ఎస్ అభ్యర్థులను ఉద్దేశించి తీవ్ర వ్యాఖ్యలు


02

## అరుణాచల్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

### అరుణాచల్ ప్రదేశ్‌లోని అంజావ్ జిల్లాలో విషాదక ఘటన

- 22 మంది కార్మికులతో వెళ్తున్న ట్రక్ లోయలో పడింది
- ప్రమాదంలో అందరూ మరణించినట్లు సమాచారం
- 13 మంది కార్మికుల మృతదేహాలను వెలికితీశారు
- కార్మికులందరూ అస్సాంలోని టీ ఎస్టేట్‌కు చెందినవారు
- ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు

02





## మంత్రి కొండా సురేఖకు నాన్ బెయిలబుల్ వారెంట్

### మంత్రి కొండా సురేఖకు నాంపల్లి ప్రత్యేక కోర్టు బిగ్ షాక్

- ఆమెపై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది
- కేటీఆర్ పరువు నష్టం దావా కేసులో ఈ తీర్పు
- కేసు విచారణను 2026 ఫిబ్రవరి 5కి వాయిదా వేసింది
- వ్యక్తిగతంగా హాజరు కావాలని కోర్టు ఆదేశించింది

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖపై నాంపల్లిలోని ప్రత్యేక కోర్టు గురువారం నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ దాఖలు చేసిన పరువు నష్టం దావా కేసులో మంత్రి కొండా సురేఖపై ఈ నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. అనంతరం ఈ కేసు విచారణను వచ్చే ఏడాది ఫిబ్రవరి 5వ తేదీకి నాంపల్లి ప్రత్యేక కోర్టు వాయిదా వేసింది. ఈ కేసులో సుదీర్ఘ విచారణ జరిగింది. ఈ విచారణ సమయంలో మంత్రి కొండా సురేఖ వ్యక్తిగతంగా కోర్టుకు హాజరుకాలేదు. దీనిపై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ కేసు తదుపరి విచారణ ఫిబ్రవరి 5వ తేదీన వ్యక్తిగతంగా హాజరు కావాలని కొండా సురేఖను కోర్టు ఆదేశించింది. గతంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌పై తెలంగాణ దేవాదాయ శాఖ

మిగతా 4లో..

## విరామం లేని ప్రయాణం

బాలీవుడ్ నటి ప్రియాంక చోప్రా హాలీవుడ్‌లోనూ వరుసగా సినిమాలు చేస్తూ ప్రపంచనటిగా గుర్తింపు తెచ్చుకున్నది. ప్రస్తుతం టాలీవుడ్ ప్రతిష్ఠాత్మక పాన్ వరల్డ్ మూవీ 'రాజమౌళి వారణాసి'లో కథానాయికగా నటిస్తూ బిజీగా ఉన్న ప్రియాంక.. తాను అనుభవిస్తున్న ఈ స్టార్‌డమ్ వెనుక పడిన కష్టాన్ని తన తాజా ఇంటర్వ్యూలో గుర్తు చేసుకున్నది. 'పరిశ్రమకి వచ్చిన కొత్తలో సినిమాలపై నాకేమాత్రం అవగాహన ఉండేది కాదు. 'మిస్ వరల్డ్' అవ్వడంతో అవకాశాలు మాత్రం వరుస కట్టేవి.అవి రావడమే అదృష్టంగా భావించేదాన్ని. దాంతో వచ్చిన ప్రతి సినిమాకూ సంతకం చేసేదాన్ని. అస్సలు విరామం ఉండేది కాదు.



05



## మరణించినా.. సర్పంచ్‌గా గెలిచాడు

### రాజన్న సిరిసిల్ల జిల్లా సర్పంచ్ ఎన్నికలల్లో విచిత్రమైన ఘటన

- చింతల్ ఠాణాలో సర్పంచ్ ఇటీవల మరణించిన మురళి గెలుపొందారు
- 300కు పైగా ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు
- మరణించడంలో గ్రామస్థులంతా ఆయనకే ఓటు వేశారు
- దీంతో ఎన్నికల అధికారులు తర్జనభర్జనలో ఉన్నారు
- మరోవైపు 95 ఏళ్ల వయసులో సర్పంచ్‌గా పోటీ చేసి గెలిచారు

04

# కవిత విషయంలో నో కాంప్రమైజ్

- కవిత విషయంలో నో కాంప్రమైజ్ అని ఇప్పటికే గ్రీన్ సిగ్నల్
- కాంగ్రెస్‌కంటే ఎక్కువగా తమనే టార్గెట్ చేస్తున్నట్టు బీఆర్ఎస్ ఫీలింగ్
- కవిత వెళ్ళిన ప్రతిచోట ఎమ్మెల్యేనో, మాజీ మంత్రో లక్ష్యం
- వాళ్ల గత వ్యవహారాలను చెప్పి ఏకిపారేస్తున్న కవిత
- మొదట్లో హరీష్‌రావుతోపాటు మాజీ మంత్రులను టార్గెట్
- తాజాగా బీఆర్ఎస్ అభ్యర్థులను ఉద్దేశించి తీవ్ర వ్యాఖ్యలు





**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

మాటకు మాట కాదు. ఒకటికి రెండు మాటలతో సమాధానం చెప్పబోతున్నారా? ఎమ్మెల్సీ కవిత విషయంలో ఇప్పటికే హద్దులన్నీ చెరిగిపోగా... ఇక నుంచి డోస్ డబుల్ చేయాలని బీఆర్ఎస్ డిసైడైందా? కవిత మీద ఇన్నాళ్ళు చేసిన విమర్శలు ఒక లెక్క, ఇక నుంచి చేయబోయేవి మరో లెక్కగా మారబోతోందా? ఈ మాటల యుద్ధంలో టాప్ సీక్రెట్స్ కూడా బయట పడబోతున్నాయా? లెట్స్ వాచ్. నువ్వు తమలపాకుతో ఒకటంటే.. నేను తలుపు చెక్కతో నాలుగంటాను అన్నట్టుగా మారిపోయింది ఎమ్మెల్సీ కవిత, బీఆర్ఎస్ ఎపిసోడ్. పార్టీకి కొరకరాని కొయ్యలా మారిపోయిన ఆమె విషయంలో తగ్గొద్దని ఇప్పటికే గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసిన గులాబీ అధిష్టానం... ఇక డోస్ పెంచే విషయంలో కూడా నాయకులకు పూర్తి స్వేచ్ఛనిచ్చేసినట్టు తెలుస్తోంది. అధికార కాంగ్రెస్, మరో ప్రతిపక్షం బీజేపీకంటే ఎక్కువగా కవిత తమనే టార్గెట్ చేస్తున్నట్టు ఫీలవుతున్నారట బీఆర్ఎస్ పెద్దలు. అందుకు తగ్గట్టే... జాగృతి జనం బాటలో హాటు ఘాటు విమర్శలు చేస్తూ.... కారు పార్టీ నేతలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు కేసీఆర్ కుమార్తె. వెళ్ళిన ప్రతి చోట అక్కడుండే ఎమ్మెల్యేనో, మాజీ మంత్రినో లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పిస్తున్నారు. అయితే... నిన్న మొన్నటి వరకు మాట వేరు, ఇప్పుడు వినిపిస్తున్న తీరు వేరన్నట్టుగా ఉందట వ్యవహారం. టైం గడిచేకొద్దీ... కవిత తన విమర్శల వాడి పెంచుతున్నారట. మొదట్లో హరీష్‌రావు తోపాటు మాజీ మంత్రులను టార్గెట్ చేయగా ఇప్పుడు రూట్ మార్చినట్టు తెలుస్తోంది. తాను ఏ నియోజకవర్గానికి వెళితే ఆ నియోజకవర్గంలో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే లేదా ఇన్చార్జ్ లక్ష్యంగా మాటల దాడి చేస్తున్నట్టు చెప్పుకుంటున్నారు. అక్కడ గతంలో వాళ్ళు చేసిన వ్యవహారాలు, వసూళ్ళు, భూ కబ్జాలు ఇలా...ఏ అంశాన్నీ వదలకుండా ఏకిపారేస్తున్నారామె. తాజాగా మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాకు వెళ్లిన కవిత అక్కడున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఉద్దేశించి తీవ్రస్థాయిలో ఆరోపణలు చేశారు. ఉద్యమ నాయకులు కాకుండా తెలంగాణ ఏర్పాటయ్యాక పార్టీలోకి వచ్చిన వారిని ఉద్దేశిస్తూ బీటీ బ్యాచ్ అంటూ గట్టిగానే అటాక్ చేశారు. బీఆర్ఎస్‌ని అడ్డంపెట్టుకుని ఈ బీటీ బ్యాచ్ చాలా రకాల అవినీతి చేసిందంటూ మండిపడ్డారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు కవిత. దీంతో ఆయన కూడా అంతకంటే ఘాటుగానే స్పందించారు. మీడియా సమావేశం పెట్టి మరీ... దాదాపుగా కవితకు వార్నింగ్ ఇచ్చేశారు మాధవరం. గతంలో ఆమె చేసిన అవినీతి చిట్టా మొత్తం తన దగ్గర ఉందని, అది అవసరమైన సమయంలో బయటపెడతానని హెచ్చరించారు. తన దగ్గరున్న వివరాలన్నీ బయటపెడితే... ఆమె తలెత్తుకోలేరని కూడా కూకట్‌పల్లి ఎమ్మెల్యే అనడం కాక రేపుతోంది. అలాగే... బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని అడ్డం పెట్టుకొని కవిత చాలా దందాలు చేసినట్టు చెప్పారాయన. లిక్కర్ కేసులో ఇరుక్కున్న కవిత ఇంట్లో ఉండే కుక్క పేరు కూడా విస్కీనే అంటూ తీవ్రస్థాయిలో అటాక్ చేశారు మాధవరం కృష్ణారావు. ఈ రకంగా కవిత సింగిల్ డోస్‌లో విమర్శిస్తే... ఇక నుంచి మేం డబుల్ డోస్‌లోకి వెళ్తామని చెప్పకనే చెబుతున్నారు బీఆర్ఎస్ లీడర్స్. ఇక మీదట మా గురించి మాట్లాడితే మేం కూడా ఆమె గురించి ఎక్కువగానే మాట్లాడతామంటున్నారు. కవిత విషయంలో కాంప్రమైజ్ వద్దని గతంలోనే పార్టీ నాయకులకు క్లియర్ కట్ ఇండికేషన్ ఇచ్చినా.. ఎంతైనా అధినేత కుమార్తె అన్న లెక్కలో కాస్త తటపటాయిస్తున్నారట అంతా. అయితే.. ఆమె ఏ మాత్రం కాంప్రమైజ్ లేకుండా టార్గెట్ చేస్తుండటంతో.. ఇంకా మీకు మొహమాటాలు ఎందుకంటూ... పై నుంచి క్లారిటీ ఇచ్చినట్టు చెప్పుకుంటున్నారు. మాధవరం కృష్ణారావు ఆ స్థాయిలో అటాక్ చేయడం వెనకున్న రీజన్ కూడా ఇదేనన్నది బీఆర్ఎస్ వర్గాల అంతర్గత సమాచారం. ఇక నుంచి కవిత విమర్శిస్తే ఏ మాత్రం తటపటాయించకుండా వెంటనే కౌంటర్స్ ఇచ్చేయమన్న సంకేతాలు వచ్చాయట గులాబీ లీడర్స్‌కు. దీంతో...ఈ విమర్శలు, ప్రతి విమర్శల పర్వం ఎంత దూరం వెళ్తుందో, ఎన్ని లోగుట్లు బయటపడతాయోనన్న చర్చ జరుగుతోందట బీఆర్ఎస్ కేడర్‌లో.

# పంచాయతీలు 'హస్తగతం'

( మొదటిపేజీ తరువాయి )


అయినప్పటికి సర్పంచ్ ఎన్నికల్లో ఆ పార్టీ కేడర్ అగ్ర నాయకత్వం మద్దతు లేకపోయిన గ్రామాల్లో తమ అస్తిత్వం కోసం మెరుగైన పోరాటం సాగించడంతో ఆ పార్టీకి సర్పంచ్ ఎన్నికల్లో గౌరవ ప్రదమైన సంఖ్యను కట్టబెట్టింది. ఉమ్మడి నల్లగొండ, వరంగల్, కరీంనగర్, అదిలాబాద్, ఖమ్మం, మహబూబ్ నగర్ జిల్లాల్లో కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ లు భారీ సంఖ్యలో గెలుపొందారు. ముఖ్యంగా తండాలు, గూడెల పంచాయతీల్లో కాంగ్రెస్ అధిపత్యం ప్రదర్శించింది. అక్కడక్కడ గెలిచిన ఇండిపెండెంట్లు సైతం ఫలితాల అనంతరం గ్రామాభివృద్ధి కోణంలో కాంగ్రెస్ కండువా కప్పుకుంటుండటం కొసమెరుపు. రాష్ట్ర వ్యాప్తంగా యువత, పెద్దలు, వృద్ధులు ఉత్సాహంగా ఓటేశారు. ఫలితంగా ఫస్ట్ ఫేజ్ పంచాయతీ ఎన్నికల్లో భారీగా ఓటింగ్ శాతం నమోదైనట్లు తెలుస్తోంది. భోజన విరామం తర్వాత మధ్యాహ్నం 2 గంటల తర్వాత కౌంటింగ్‌చేపట్టి విజేతలను ప్రకటించనున్నారు. ఆ వెంటనే గెలుపొందిన సర్పంచ్, వార్డు మెంబర్లు ప్రత్యేకంగా సమావేశమై ఉప సర్పంచ్‌లను ఎన్నుకోనున్నారు. తొలి విడతలో 3,834 సర్పంచ్, 27,628 వార్డ్ మెంబర్ స్థానాలకు పోలింగ్ జరిగింది. కొన్ని చోట్ల చెల్లాచెదురు ఘటనలు మినహా మిగిలిన అన్నీ చోట్ల పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా భారీగా పోలీసులను మోహరించారు. మరోవైపు.. రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు పోలింగ్ సరళిని నిశితంగా పరిశీలించారు. వెబ్ కాస్టింగ్ ద్వారా పోలింగ్ సరళిని అబ్జర్వ్ చేశారు. అత్యధికంగా వరంగల్, అత్యల్పంగా ఆదిలాబాద్ జిల్లాలో పోలింగ్ పర్సంటేజ్ నమోదైనట్లు సమాచారం.

కామారెడ్డి జిల్లా రాజంపేట మండలం నడిమితండాలో సర్పంచ్ ఫలితాలు తీవ్ర ఉత్కంఠకు దారితీశాయి. హోరాహోరీ పోరులో కాంగ్రెస్ బలపరిచిన లక్ష్మీ ఒకే ఒక్క ఓటుతో గెలిచారు. వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలంలో సర్పంచ్ ఎన్నికల ఫలితాల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకంది. తమకు భోజనం రాలేదని.. ఓట్లు లెక్కించమని ఎన్నికల సిబ్బంది ఆగ్రహం వ్యక్తం చేశారు. కాసేపు ఓట్ల లెక్కింపు ప్రక్రియను ఆపేశారు. భోజనం వచ్చాక.. లంచ్ చేసాక ఓట్లు లెక్కిస్తామని సిబ్బంది వాపోయారు. కొద్దిసేపు అనంతరం అధికారులు.. భోజనం ఏర్పాటు చేశారు. భోజనం చేసిన అనంతరం కొంత ఆలస్యంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియ మొదలైంది.

14న రెండోవిడత ఎన్నికలకు 4,332 గ్రామ పంచాయతీలను నోటిఫై చేశారు. 5 స్థానాల్లో నామినేషన్లు దాఖలు కాలేదు. 415 సర్పంచ్‌లు ఏకగ్రీవమయ్యారు. దీంతో మిగిలిన 3,906 సర్పంచ్ స్థానాలకు 13,128 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. 38,322 వార్డులకు నోటిఫై చేయగా 107 వార్డుల్లో ఎవరూ నామినేషన్లు వేయలేదు. 17న జరగనున్న మూడోవిడత ఎన్నికలకు 4,157 పంచాయతీల్లోని 11 సర్పంచ్ పదవులకు, 36,434 వార్డుల్లో 112 చోట్ల నామినేషన్లు పడలేదు. 415 సర్పంచ్ స్థానాలు, 7,916 వార్డు సభ్యులు ఏకగ్రీవమయ్యాయి. దీంతో మిగిలిన 3,752 సర్పంచ్ స్థానాలకు 13,128 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. ఇక మిగిలిన 28,406 వార్డులకు 75,2833 మంది పోటీ పడుతున్నారు.

# అరుణాచల్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

**విశాలభారతి, నేషనల్:**



దేశవ్యాప్తంగా ఘాట్ రోడ్లపై వరుసగా రోడ్డు ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇటీవలే మహారాష్ట్రలో జరిగిన దుర్ఘటనలో 6 మంది ప్రాణాలు కోల్పోగా.. తాజాగా గురువారం అరుణాచల్ ప్రదేశ్‌లోని అంజావ్ జిల్లాలో జరిగిన ప్రమాదంలో 22 మంది మరణించారు. అరుణాచల్ ప్రదేశ్‌లోని అంజావ్ జిల్లాలో ఈ విషాదకరమైన రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. చాగ్లగాం ప్రాంతంలో కార్మికులను తీసుకెళ్తున్న ట్రక్కు కొండపై నుంచి లోతైన లోయలో పడిపోయింది. ఆ ట్రక్కులో ఇరవై ఇద్దరు కార్మికులు ఉన్నారు. వారందరూ ప్రమాదంలో మరణించారని స్థానిక పోలీసులు తెలిపారు.. ఈ కార్మికులలో 19 మంది అస్సాంలోని టిన్సుకియా జిల్లాలోని గిలాపుకురి టీ ఎస్టేట్ నివాసితులుగా గుర్తించారు. ఇందుకు సంబంధించి సమాచారం అందుకున్న పోలీసులు సహాయకచర్యల్లో నిమగ్నమయ్యారు. ప్రస్తుతం సంఘటన స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఇప్పటివరకు 13 మంది కార్మికుల మృతదేహాలను వెలికితీశారు. మిగిలిన కార్మికుల మృతదేహాల కోసం అన్వేషణ జరుగుతోంది. గురువారం హైలాంగ్‌చాగ్లఘం రోడ్డులోని మెటెంగ్లియాంగ్ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. కార్మికులందరూ అస్సాంలోని టిన్సుకియా జిల్లాలోని గెలాపుఖురి టీ ఎస్టేట్‌కు చెందినవారు. కాంట్రాక్టుపై పని చేయడానికి వారు అరుణాచల్ ప్రదేశ్‌లోని ఒక ప్రాజెక్ట్ సైట్‌కు ప్రయాణిస్తున్నారు. ఇరుకైన మలుపులు, నిటారుగా దిగులు, లోతైన లోయలతో కూడిన ప్రమాదకరమైన రహదారిపై ఈ ఘటన జరిగింది. మృతుల్లో బుధేశ్వర్ దీప్, రాహుల్ కుమార్, సమీర్ దీప్, జాన్ కుమార్, పంకజ్ మంకీ, అజయ్ మంకీ, బిజయ్ కుమార్, అభయ్ భూమిజ్, రోహిత్ మంకీ, బీరేంద్ర కుమార్, అగోర్ తంతి, ధీరేన్ చెటియా, రజనీ నాగ్, దీప్ గోవాలా, రామ్‌చ్‌బాక్ సోనార్, సొనాతన్ నాగ్, సంజయ్ కుమార్, కరణ్, కరణ్, కరణ్, కరణ్, జోన కుమార్, కరణ్, జోన మరో ముగ్గురు కార్మికులను ఇంకా గుర్తించలేదు. మృతుల కుటుంబాలకు సమాచారం అందించారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. దర్యాప్తు జరుగుతోందని, త్వరలోనే కారణం తెలుస్తుందని అంజా డిప్యూటీ కమిషనర్ మిలో కోజిన్ తెలిపారు.

పోలీసుల కథనం ప్రకారం.. అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రం అంజా జిల్లాలోని చాగ్లగాం ప్రాంతం (హైలాంగ్‌చాగ్లఘం రోడ్డులోని మెటెంగ్లియాంగ్ సమీపంలో) ఈ ప్రమాదం జరిగింది. మరణించిన 22 మంది కార్మికులలో 19 మంది అస్సాంలోని టిన్సుకియా జిల్లాలోని గిలాపుకురి టీ ఎస్టేట్‌కు చెందినవారుగా పోలీసులు గుర్తించారు. వీరంతా ఒక కాంట్రాక్టు పని కోసం అరుణాచల్ ప్రదేశ్‌లోని ప్రాజెక్ట్ సైట్‌కు వెళుతున్నట్లు స్పష్టం చేశారు. ప్రమాదం జరిగిన రోడ్డు ప్రయాణానికి అనువుగా లేదు. చాలా ప్రమాదకరమైన రీతిలో ఉంది. ఇరుకైన మలుపులు, నిటారుగా దిగులు, లోతైన లోయలు ఈ మార్గంలో తరచుగా ప్రమాదాలకు దారితీస్తుంటాయి. ఈ ప్రమాదం జరగడానికి గల కారణాలపై దర్యాప్తు జరుగుతోందని ఓ పోలీసు అధికారి స్పష్టం చేశారు. ప్రమాదంపై సమాచారం అందిన వెంటనే పోలీసులు, సహాయక బృందాలు రంగంలోకి దిగాయి. 19 మంది కార్మికుల మృతదేహాలను వెలికితీసినట్లు పోలీసులు స్పష్టం చేశారు. అయితే మరణించిన వారిలో 19 మంది వివరాలను తెలుసుకోగా.. మరో ముగ్గుర్ని ఇంకా గుర్తించాల్సి ఉందట. మిగిలిన మృతదేహాల కోసం గాలింపు కొనసాగుతోంది. వెలికితీసిన మృతదేహాలను పోస్ట్‌మార్టం పరీక్షల కోసం పంపినట్లు తెలుస్తోంది. ఈ ప్రాంతం ఇండోచైనా సరిహద్దు వెంబడి ఉండటం వల్ల.. ఇక్కడ రోడ్డు ప్రాజెక్టుల్లో పనిచేసే కార్మికులు తరచుగా వాతావరణ మార్పులు, కొండచరియలు విరిగిపడడం వంటి ప్రమాదకర పరిస్థితులను ఎదుర్కొంటున్నారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో బిగ్ షాక్

- ఫోన్ ట్యాపింగ్ కేసులో సుప్రీం కోర్టు కీలక తీర్పు వెల్లడించింది
- పోలీసుల ముందు సరండర్ కావాలని ధర్మాసనం ఆదేశించింది
- జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ ముందు హాజరు కావాలని స్పష్టం
- విచారణ సమయంలో ఎటువంటి టార్చర్ చేయద్దంటూ ఆదేశం
- 14 రోజుల విచారణకు వీలుకల్పించాలని వాదలనలు
- కీలక ఆధారాలు ధ్వంసం చేశారని ప్రభుత్వం ఆశ్రయించింది



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ ప్రభాకర్ రావుకు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. శుక్రవారం పోలీసుల ముందు సరండర్ కావాలని ప్రభాకర్ రావును జస్టిస్ బి.వి. నాగరత్న సుప్రీంకోర్టు ధర్మాసనం ఆదేశించింది. ఉదయం 11 గంటలకు జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ (సిట్) ముందు హాజరు కావాలని ఆయనకు స్పష్టం చేసింది. ఏసీపీ వెంకటగిరి ముందు హాజరుకావాలని ప్రభాకర్ రావుకు సూచించింది. విచారణ సమయంలో ఆయనను ఎటువంటి టార్చర్ చేయవద్దంటూ సిట్ అధికారులకు సుప్రీంకోర్టు ధర్మాసనం తెలిపింది. ఈ కేసు విచారణను వచ్చే శుక్రవారం పర్యవేక్షించనున్నట్లు సుప్రీంకోర్టు ధర్మాసనం వెల్లడించింది. కస్టడీ సమయంలో ప్రభాకర్ రావుకు ఇంటి నుంచి భోజనాన్ని తీసుకువెళ్లేందుకు న్యాయస్థానం అనుమతించింది. మరోవైపు ఈ కేసులో 14 రోజుల పాటు ప్రభాకర్ రావును విచారణకు అనుమతించాలని సుప్రీంకోర్టు ధర్మాసనాన్ని తెలంగాణ ప్రభుత్వం తరపు న్యాయవాది సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు బెయిల్ రద్దు చేయాలంటూ తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై మంగళవారం సుప్రీంకోర్టు ధర్మాసనం విచారణ జరిపింది. ఈ కేసును గురువారానికి వాయిదా వేసింది. ఈ పిటిషన్‌పై గతనెల.. నవంబర్ 18వ తేదీనే వాదనలు జరగాల్సి ఉంది. కానీ ప్రభాకర్ రావు తరఫు న్యాయవాది అందుబాటులో లేరు. దాంతో ఈ పిటిషన్‌పై విచారణ పలుమార్లు వాయిదా పడుతూ వచ్చింది. చివరగా శుక్రవారం.. అంటే గురువారం ఈ పిటిషన్‌పై సుప్రీంకోర్టు ధర్మాసనం విచారణ చేపట్టింది.


ఈ ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక ఆధారాలను ప్రభాకర్ రావు ధ్వంసం చేశారంటూ సుప్రీంకోర్టును తెలంగాణ ప్రభుత్వం ఆశ్రయించింది. డిజిటల్ ఎక్విప్‌మెంట్, పాస్ వర్డ్ ఇవ్వకుండా విసిగించడంతోపాటు విచారణకు ఆయన ఏ మాత్రం సహకరించలేదని ప్రభుత్వం తరఫు న్యాయవాదులు సుప్రీంకోర్టుకు తమ వాదనల ద్వారా వినిపించారు. దీంతో ఫోరెన్సిక్ నిపుణుల ముందు ఐ క్లౌడ్, పాస్ వర్డ్ రీసెట్ చేయాలని గత విచారణలో ప్రభాకర్ రావును సుప్రీంకోర్టు ఆదేశించిన విషయం విదితమే.

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతిపక్ష పార్టీల నేతలపైనే కాకుండా.. స్వపక్షంలోని పలువురు అగ్ర నేతల నేతలపై ఫోన్ ట్యాపింగ్ చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇదే విషయాన్ని వివిధ రాజకీయ పార్టీలకు చెందిన కీలక నేతలు సైతం పలుమార్లు వివిధ వేదికల మీద ఆరోపించారు. 2023 ఏడాది చివరిలో జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో.. కాంగ్రెస్ పార్టీకి ఓటరు పట్టం కట్టాడు. దీంతో రేవంత్ రెడ్డి సారథ్యంలో ప్రభుత్వం కొలువు తీరింది.

ఫోన్ ట్యాపింగ్ అంశంపై వాస్తవాలు వెలికితీయాలంటూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు సంస్థ (సిట్)ను ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా గత ప్రభుత్వంలో ఇంటెలిజెన్స్‌లో కీలకంగా వ్యవహరించిన పలువురు ఉన్నతాధికారులను సిట్ అధికారులు సుదీర్ఘంగా విచారించారు. దాంతో ఫోన్ ట్యాపింగ్ జరిగింది వాస్తవమని వారు ధృవీకరించారు. ఈ సందర్భంగా పలువురు ఉన్నతాధికారులను అరెస్ట్ చేశారు. అయితే ఈ కేసులో అత్యంత కీలకంగా వ్యవహరించిన ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు అమెరికా వెళ్లిపోయారు. ఆయనను భారత్‌కు రప్పించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం పలు ప్రయత్నాలు చేసింది. ఈ విషయం తెలుసుకున్న ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు.. సిట్ అధికారులు తనను అరెస్ట్ చేయకుండా ఉండాలంటూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ప్రభాకర్ రావును ముందస్తు అరెస్ట్ చేయవద్దంటూ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. దాంతో స్వదేశానికి వచ్చిన ప్రభాకర్ రావు.. సిట్ అధికారుల ఎదుట విచారణకు హాజరయ్యారు. కానీ ఈ విచారణలో అధికారులు సంధించిన ప్రశ్నలకు ప్రభాకర్ రావు ఎటువంటి సమాధానం ఇవ్వలేదు. బెయిల్ కోసం సుప్రీంకోర్టును ఆయన ఆశ్రయించారు. ఆయనకు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో ప్రభాకర్ రావు బెయిల్ రద్దు చేయాలంటూ సుప్రీంకోర్టును రేవంత్ ప్రభుత్వం ఆశ్రయించింది. ఈ కేసులో వాదోపవాదాలు విన్న అత్యున్నత న్యాయస్థానం.. పోలీసుల ఎదుట లొంగిపోవాలంటూ ప్రభాకర్ రావును ఆదేశించింది.

# తెలంగాణ ఎంపీలకు మోడీ చివాట్లు

- తెలుగు రాష్ట్రాల బీజేపీ ఎంపీలకు ప్రధాని మోడీ క్లాస్
- ఏపీ బీజేపీ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండటం లేదన్న మోడీ
- వైసీపీ, జగన్ చేస్తున్న వ్యాఖ్యలకు గట్టిగా కౌంటర్ ఇవ్వాలని ఆదేశం
- తెలంగాణ బీజేపీ ఎంపీల పనితీరుపై అసంతృప్తి
- తెలంగాణలో కనీసం ప్రతిపక్ష పాత్ర కూడా పోషించడం లేదని చివాట్లు
- మంచి టీమ్‌ను పెట్టుకుని సమర్థంగా ఎదుర్కోవడానికి సమస్యేంటని ఫైర్



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

రెండు తెలుగు రాష్ట్రాల్లో జరుగుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇటీవల పార్టీ ఎంపీలతో జరిగిన సమావేశంలో ఆయన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాజకీయ పరిస్థితులపై స్పష్టమైన సూచనలు చేసినట్లు సమాచారం. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడు అద్భుతమైన పాలన అందిస్తున్నారని ప్రధాని అభినందించారు. రాష్ట్రంలో కూటమి పార్టీలు సమన్వయంతో ముందుకు సాగుతున్న తీరు శుభపరిణామమని పేర్కొన్నారు. ముఖ్యంగా తెలుగుదేశం పార్టీతో బీజేపీ సమన్వయ వ్యవహారం బాగా కొనసాగుతుందని మోదీ అభిప్రాయపడ్డారు.

ఇక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీపై ఇంకా దూకుడుగా వ్యవహరించాలని బీజేపీ ఎంపీలకు సూచించినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ వ్యవహారాలపై, ప్రజా సమస్యలపై వైసీపీని మరింత టార్గెట్ చేస్తూ పోరాడాలని ప్రధాని స్పష్టం చేశారు. సామాజిక మాధ్యమాల వినియోగంలో మరింత చురుకుదనం అవసరమని ప్రధాని మోదీ అన్నారు. మీడియా, సోషల్ మీడియా ద్వారానే ప్రజలకు వేగంగా చేరువయ్యే అవకాశం ఉండటంతో, బీజేపీ నాయకులు మరింత యాక్టివ్‌గా ఉండాలని సూచించారు. తెలంగాణలో బీజేపీ పాత్రపై కూడా ప్రధాని అసంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పార్టీ మరింత క్రియాశీలకంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని, ప్రతిపక్ష పాత్రను మరింత బలంగా పోషించాలని సూచించారు. సోషల్ మీడియా రంగంలో కూడా తెలంగాణ బీజేపీ వెనుకబడిందని మోదీ స్పష్టం చేశారు. అసదుద్దీన్ ఓవైసీ సోషల్ మీడియా బీజేపీ కంటే తెలంగాణలో బలంగా పనిచేస్తోందని ప్రధాని వ్యాఖ్యానించారు. డిజిటల్ వేదికల ద్వారా ప్రజలను ఆకట్టుకోవడంలో పార్టీ శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రస్తుత కాలంలో సామాజిక మాధ్యమాలే ప్రజలకు చేరుకునే ప్రధాన వేదికలుగా మారాయని, అందువల్ల ఈ రంగంపై మరింత దృష్టి పెట్టాలని ప్రధాని మోదీ నేతలకు సూచించారు. ప్రధాని మోడీ తన అసంతృప్తిని కేవలం మాటలకే పరిమితం చేయకుండా.. అందుకు సంబంధించిన ఆధారాలను కూడా ఎంపీల ముందుంచడం గమనార్హం. ముఖ్యంగా.. సోషల్ మీడియా విషయంలో తెలంగాణ బీజేపీ యూనిట్ తీరుపై ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఎంపీలు, ముఖ్య నాయకులు సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉన్నప్పటికీ.. రాష్ట్ర రాజకీయాలపై ప్రభావం చూపగలిగే విధంగా సామాజిక మాధ్యమాలను ఉపయోగించుకోలేక పోతున్నారని మోడీ విమర్శించారు.

మరీ ముఖ్యంగా.. రాష్ట్ర రాజకీయాలపై, ముఖ్యంగా హైదరాబాద్ ప్రాంతంలో గట్టి పట్టున్న ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ సోషల్ మీడియా వేదికల కంటే కూడా బీజేపీ తెలంగాణ యూనిట్ వెనుకబడి ఉందని ప్రధాని పైరయ్యారు. దీనికి సంబంధించిన గణాంకాలను ఆయన నేతలకు చూపించారు. 'ప్రజల్లో ఇంత ఆదరణ, అనుకూలత ఉన్నా, సామాజిక మాధ్యమాల ద్వారా ఆ మద్దతును ఓట్లుగా మలుచుకోలేకపోవడం నాయకత్వ వైఫల్యం కాదా?' అని ఆయన సూటిగా ప్రశ్నించినట్లు సమాచారం. దేశ వ్యాప్తంగా బీజేపీకి సోషల్ మీడియా ఒక ప్రధాన బలం కాగా, తెలంగాణలో అది బలహీనపడటంపై మోడీ అసంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పార్టీ మరింత బలపడాల్సిన అవసరం ఉందని.. అందుకు అందరూ కలసికట్టుగా పని చేయాలని ప్రధాని మోడీ ఎంపీలకు హితవు పలికారు. ప్రస్తుతం రాష్ట్రంలో బలమైన ప్రధాన ప్రతిపక్షం లేకపోవడంతో.. ఆ స్థానాన్ని బీజేపీ ఆక్రమించడానికి ఇది సరైన సమయమని ఆయన సూచించారు. కానీ, పార్టీలో అంతర్గత విబేధాలు, 'ఎవరికి వారే యమునా తీరే' అన్నట్టుగా నాయకులు పనిచేయడం వల్ల ఆ అవకాశాన్ని కోల్పోతున్నారని మోడీ అభిప్రాయపడ్డారు. 'కేవలం గెలిచిన ఎంపీ స్థానాలకే పరిమితం కాకుండా.. రానున్న శాసనసభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని అన్ని నియోజకవర్గాలపై దృష్టి సారించాలి. ప్రతి ఎంపీ తమ పరిధిని దాటి, ఇతర జిల్లాల్లోనూ పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలి. కేవలం కేంద్ర ప్రభుత్వ పథకాలు, విజయాలను మాత్రమే చెప్పకుండా, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలి' అని ఆయన స్పష్టం చేశారు

పార్టీ కార్యకర్తలను, స్థానిక నాయకులను నిరంతరం ప్రోత్సహించాలని.. వారికి మార్గనిర్దేశం చేయాలని ప్రధాని సూచించారు. ప్రతి ఎంపీ తమ నియోజకవర్గంలో నెలలో కనీసం పది రోజులు పర్యటించాలని, ప్రభుత్వ వ్యతిరేకతను గుర్తించి, వాటిని పరిష్కరించే దిశగా తమ వంతు ప్రయత్నం చేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు. కేవలం ఢిల్లీ చుట్టూ తిరగడం కాకుండా, క్షేత్రస్థాయి పరిస్థితులను అర్థం చేసుకుని, ప్రజల సమస్యలపై స్పందించాల్సిన అవసరం ఉందని మోడీ ఉద్ఘాటించారు.

తెలంగాణలో బీజేపీ బలోపేతానికి తన సహకారం ఎప్పుడూ ఉంటుందని, అయితే ఆ చొరవను, దూకుడును రాష్ట్ర నాయకత్వం ప్రదర్శించాలని ఆయన ఆకాంక్షించారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారమే లక్ష్యంగా పార్టీ పనిచేయాలని, అందుకు తగ్గట్టుగా పార్టీ గ్రాఫ్ పెరిగేలా ఎంపీలు సమిష్టిగా శక్తివంతంగా కృషి చేయాలని ప్రధాని మోడీ తన క్లాస్‌ను ముగించినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

ఫలక్‌నూమా ప్యాలెస్‌కు రాకపోకలు సాగించే మార్గాలు అక్రమంగా వచ్చేందుకు అవకాశమున్న ప్రాంతాలను పోలీసులను గుర్తిస్తున్నారు. ఉప్పల్ స్టేడియంలో జరిగే మ్యాచ్‌కు టికెట్‌లు, పాస్‌లు ఉన్నవారిని మాత్రమే అనుమతిస్తారు. పాస్‌లు లేనివారిని ఎట్టి పరిస్థితుల్లో అనుమితించలేమని నిర్వాహకులు స్పష్టం చేశారు. స్టేడియం దగ్గర రద్దీకి అవకాశం లేకుండా అభిమానులు సహకరించాలని, అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ విజయవంతమైన తీరు, తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణపై వారి మధ్య చర్చ కొనసాగింది. సమ్మిట్‌లో రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు రాబట్టేందుకు ఒప్పందాలు చేసుకోవడంపై అగ్ర నేతలు సీఎంను ప్రశంసించారు. ఈ భేటీలో పార్టీ బలోపేతం, ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలపై చర్చ జరిగిందని తెలిపారు. అలాగే, ఇటీవల జరిగిన గ్లోబల్ సమ్మిట్ విజయవంతం, పెట్టుబడుల వివరాలను కూడా కాంగ్రెస్ అగ్రనేతలకు వివరించారు. ఖర్గేతో భేటీ అనంతరం సీఎం రేవంత్ రెడ్డి పార్లమెంట్‌కు చేరారు. పార్లమెంట్‌లో వారు పలువురు కేంద్ర మంత్రులతో సమావేశమై, రాష్ట్ర నిధులు, పెండింగ్ ప్రాజెక్టులు వంటి కీలక అంశాలపై చర్చించనున్నారు. సమగ్రంగా, తెలంగాణ ప్రభుత్వ పనితీరు, రాష్ట్రాభివృద్ధి, పెట్టుబడుల ప్రోత్సాహక కార్యక్రమాలపై కేంద్ర ప్రభుత్వంతో సన్నిహిత సంబంధాలను పటిష్టం చేయడమే ఈ పర్యటన ప్రధాన లక్ష్యం అని విశ్లేషకులు పేర్కొంటున్నారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ఘనంగా నిర్వహించబడిన నేపథ్యంలో రాష్ట్రానికి రూ.5 లక్షల కోట్ల పైగా పెట్టుబడులు కట్టేందుకు వివిధ సంస్థలు ముందుకొచ్చాయి. ఈ విజయం పై గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని పార్లమెంట్‌లో పోరిక బలరాం నాయక్, సురేష్ షెట్కార్, డాక్టర్ మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎం. అనిల్ కుమార్ అభినందనలు తెలిపారు.

DISTRICT news
WWW.VISHALABHARATI.COM
విశాల భారతి


# జీతాల పెంపు డిమాండ్ వెంటనే పరిష్కరించాలి

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్.రమా
- స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్న షాహీ మహిళా కార్మికుల పోరాటం



**నాచారం, విశాలభారతి:** చలి, భయం, ఒత్తిడిని లెక్కచేయకుండా హక్కుల కోసం ధైర్యంగా పోరాడుతున్న షాహీ మహిళా కార్మికుల సంకల్పం అభినందనీయమని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్.రమా అన్నారు. నాచారం పరిశ్రమ ప్రాంతంలోని షాహీ యూనిట్‌లో జీతాల పెంపు కోసం మహిళలు చేపట్టిన నిరసన నాలుగో రోజుకు చేరిన సందర్భంగా ఆమె కార్మికులను కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తక్కువ వేతనాలతో కుటుంబాలు నెట్టుకొస్తున్న పరిస్థితుల్లో కనీసం 16,000 రూపాయల కనీస వేతనం ఇవ్వడం యాజమాన్యం బాధ్యత అని ఎస్.రమా స్పష్టం చేశారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను పట్టించుకోకుండా షాహీ యాజమాన్యం మొండి వైఖరి ప్రదర్శించడం తీవ్రంగా ఖండించారు. మహిళలు ఐక్యంగా నిలుస్తున్న వేళ యాజమాన్యం చర్చలకు ముందుకు వచ్చి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆమె డిమాండ్ చేశారు. ప్రభుత్వం కూడా జోక్యం చేసుకుని మహిళా కార్మికులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు.ఐఎఫ్టియు నాయకులు అరుణ, ప్రదీప్ మాట్లాడుతూ.. నియమాల ప్రకారం 18 వేల రూపాయల వేతనం ఇవ్వాల్సి ఉండగా, ఇప్పటికీ 9 వేల మాత్రమే చెల్లించడం షాహీ యాజమాన్యం అవలంబిస్తున్న స్పష్టమైన దోపిడీ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికుల పోరాటానికి సంఘీభావంగా చర్లపల్లి లోని ఏపీ రాక్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో 800 మంది కార్మికులకు భోజనం ఏర్పాటు చేశారు. షాహీ యూనిట్ మహిళా కార్మికులు చేస్తున్న ఆందోళనకు మద్దతుగా ఈ కార్యక్రమం చేపట్టామని యూనియన్ నాయకులు తెలిపారు. కార్మికుల పోరాటం విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ తమ మద్దతు, సహకారం కొనసాగిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ మేడ్చల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జె.చంద్రశేఖర్, ఎర్ర అశోక్, నాయకులు పి.సత్యం, పి.గణేష్, ఐ.రాజశేఖర్, జె.వెంకన్న, లింగస్వామి, ఆర్. సంతోష్, మణికంత, బి.వి. సత్యనారాయణ, రమేష్, ఏఐటియుసి నాయకులు సత్యప్రసాద్, ధర్మేంద్ర, రమేష్ తదితర కార్మిక సంఘ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

## పలు కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ



**నిజామాబాద్, విశాలభారతి:** భీమ్‌గల్ పట్టణంలోని పలువురి కుటుంబాలను బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి పరామర్శించారు. గురువారం భీమ్‌గల్ చేరుకున్న ఎమ్మెల్యే ఇటీవల మరణించిన లింబాద్రి గుట్ట ధర్మకర్త నంబి లింబాద్రి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం బీఆర్ఎస్ కార్యకర్తలు రాజేష్ ( లడ్డు ) రఘు కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి ని వ్యక్తపరిచారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ నాయకులు గున్నాల భగత్, బోదిరే నర్సయ్య, సతీష్‌గౌడ్, మల్లెల ప్రసాద్, పర్స నవీన్, ఇక్రమ్, మొయిస్, లాల, సాగర్ తదితరులు ఉన్నారు.

## పోలింగ్ కేంద్రాలను సందర్శించిన సీపీ సాయి చైతన్య



**నిజామాబాద్, విశాలభారతి:** మొదటి విడత ఎన్నికలలో భాగంగా బోధన్ మండలంలోని భవానిపేట్ లో గ్రామపంచాయతీ పోలింగ్ బూత్ లను సందర్శించిన నిజామాబాదు పోలీస్ కమీషనర్శ్రీ పి.సాయి చైతన్య, ఐ.పి.ఎస్. ఆయా పోలింగ్ బూత్‌ల వద్ద బందోబస్తు ఏర్పాట్లు , భద్రతా చర్యలను పరిశీలించారు.ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో మాట్లాడుతూ ఎన్నికలు పూర్తిగా ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛాయుతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని రకాల చర్యలను తీసుకోవాలని , సిబ్బంది అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించడం జరిగింది. ప్రజలు శాంతి యూత వాతావరణం లో తమ ఓటు హక్కు ను సధ్వినియోగం పర్చుకోవాలని సూచించారు.

## దైవచింతనతోనే మానసిక ప్రశాంతత

- జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి
- తులేకలాన్‌లో వైభవంగా అయ్యప్ప మహా పడిపూజ



**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:** దైవచింతనతోనే మానసిక ప్రశాంతత లబిస్తుందని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి అన్నారు. తులేకలాన్ గ్రామంలో కలకొండ నిఖిల్ కన్నెస్వామి నిర్వహించిన మహా పడిపూజ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. శ్రావణమాసం , కార్తీకమాసం ప్రత్యేక పూజలతో గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిస్తున్నదని చెప్పారు. యువత ఆధ్యాత్మిక మార్గంలో పయనించడం శుభపరిణామం అన్నారు. దనరాజ్ గురుస్వామి , జనార్ధన్ గౌడ్ గురుస్వాములు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అన్నదాన ప్రభువు కలకొండ జంగయ్య , మండల బిఆర్ఎస్ అధ్యక్షుడు బుగ్గరాములు , మాజీ సర్పంచులు యాదగిరి , యెర్నాగి జయమ్మ , బీరప్ప , మాజీ ఎంపిటిసి బండ ఎంకమ్మ , బత్తుల విజయరంగారెడ్డి , సామ రవీందర్ రెడ్డి , వీరన్న , బాష , యాదగిరి పెద్దసంఖ్యలో స్వాములు , భక్తులు పాల్గొన్నారు.

## ఎన్నికల కోడ్ ముగిసే వరకు విజయోత్సవాలు నిషేధం

- జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా




**వికారాబాద్, విశాలభారతి:** ఎన్నికల ఫలితాలు వచ్చినా ర్యాలీలు, బైక్ శోభాయాత్రలు పూర్తిగా నిషేధం అని, నిబంధనలు ఉల్లంఘిస్తే వెంటనే చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా పేర్కొన్నారు. జిల్లాలో మూడు దశల పంచాయతీ ఎన్నికల పూర్తి ప్రక్రియ ముగిసే వరకు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమల్లోనే కొనసాగుతుందని తొలి దశ ఫలితాలు వచ్చినా గెలిచిన అభ్యర్థులు లేదా వారి అనుచరులు విజయోత్సవ ర్యాలీలు, భారీ సభలు, బైక్ ర్యాలీలు, శోభాయాత్రలు, డీజేలు వంటి వేడుకలు నిర్వహించడం పూర్తిగా నిషేధం. ఎన్నికల కొనసాగుతున్నంత కాలం ఆంక్షలను తప్పనిసరిగా పాటించాల్సిందేనని ఎవరైనా నియమాలను అతిక్రమించే వారిపై వెంటనే కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటాం అని ప్రజాస్వామ్య ప్రక్రియ సజావుగా సాగాలంటే నిబంధనలు పాటించడం ప్రతి పౌరుడి బాధ్యత కావున శాంతియుత వాతావరణం కోసం ప్రజలు, నాయకులు, అభ్యర్థులు పూర్తి సహకారం అందించాలని జిల్లా ఎస్పీ కోరారు.

## పోలీసుల పేరు చెప్పి డబ్బులు కాజేసిన కేటుగాళ్లు

- పోలీసులనే మోసం చేసిన సైబర్ నేరగాళ్లు
- సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన పెట్రోల్ బంక్ మేనేజర్




**కీసర, విశాలభారతి:** కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం సబ్ ఇన్స్పెక్టర్ లక్ష్మణ్ అంటూ పెట్రోల్ బంక్ కి ఫోన్ చేసి 20 వేల రూపాయలు కాజేసిన సైబర్ నేరగాళ్లు.వివరాల్లోకి వెళ్తే బోగారం వై ఎస్ ఆర్ పెట్రోల్ ఫిల్లింగ్ స్టేషన్ లో పని చేసే మానేజర్ హనుమంత్ రావు.బుధవారం మధ్యాహ్నం సమయంలో పెట్రోల్ బంకు మానేజర్ హనుమంత్ కి సురేష్ కుమార్ సి ఐ ఫోన్ నెంబర్ నుండి ఫోన్ వచ్చింది.నేను కీసర సబ్ ఇన్స్పెక్టర్ లక్ష్మణ్ నీ నాకు 20 వేల రూపాయలు ఫోన్ పే చేయండి సాయంత్రం మా మనిషి వచ్చి డబ్బులు ఇస్తాడు అని చెప్పడంతో మానేజర్ అతని స్నేహితునికి ఫోన్ చేసి కీసర పోలీస్ స్టేషన్లో లక్ష్మణ్ అని సబ్ ఉన్నారా అని కానున్నాడు.అతని స్నేహితుడు కీసర పోలీస్ స్టేషన్లో సబ్ ఇన్స్పెక్టర్ లక్ష్మణ్ ఉన్నాడు చెప్పడంతో మానేజర్ ఆ గుర్తు తెలియని ఫోన్ నెంబర్ కి ఫోన్ పే 20 వేల రూపాయలు చేయడం జరిగింది.సాయంత్రం అయిన ఇంకా పెట్రోల్ బంకుకి ఎవరు రాలేదు డబ్బులు ఇవ్వక పోవడంతో అప్పుడు అతనికి తెలిసిపోయింది నేను మోసపోయాను అని వెంటనే గురువారం ఉదయం కీసర పోలీస్ స్టేషన్లో బాధితుడు హనుమంత్ రావు ఫిర్యాదు చేశాడు.

## ఎన్నికల్లో సర్పంచ్ అభ్యర్థుల వాగ్దానాలు




**మోయినాబాద్, విశాలభారతి:** మండలంలో గ్రామ పంచాయతీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రచారం జోరందుకుంది. స్థానికంగా ప్రజల ఆశీర్వాదంతో తమ అభ్యర్థిత్వాన్ని ప్రకటించిన పోటీదారు తమ మద్దతుదారులతో కలిసి విస్తృత ప్రచారం చేపడుతున్నారు. 14122025 న జరుగనున్న ఓటింగ్‌ను దృష్టిలో పెట్టుకుని, అభ్యర్థి తన ప్రధాన సంకల్పాలను ప్రజలకు తెలియజేశారు. గ్రామ అభివృద్ధి, శానిటేషన్, రహదారి సౌకర్యాలు, మౌలిక వసతుల బలోపేతం తదితర అంశాలను ప్రాధాన్యంగా చేపడతామని హామీ ఇచ్చారు. గ్రామంలోని ప్రతి ఇంటికి శుద్ధి చేసిన తాగునీటి నుంచి సాయంత్రం 1 వరకు జరుతుంది. గ్రామ ప్రజల ఆశీస్సులతో అభివృద్ధి సాధ్యమని అభ్యర్థి నమ్మకం వ్యక్తం చేశారు.

## యశోద రత్నంను గెలిపించాలని ఇంటింటి ప్రచారం



**మొయినాబాద్, విశాలభారతి:** మోత్కుపల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా కోర్దుటి యశోద రత్నంను గెలిపించాలని ఇంటింటి ప్రచారంలో బ్యాట్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థి విజ్ఞప్తి చేస్తున్నారు. మండల పరిధిలోని మోత్కుపల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా బరిలో ఉన్న సర్పంచ్ అభ్యర్థిగా కోర్దుటి యశోద రత్నంను గ్రామంలోని మహిళలు నాయకులు యువకులతో కలిసి పెద్ద ఎత్తున ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నా బలం బలగం మీరేనని నిరంతరం గ్రామ అభివృద్ధికి పాటుపడతానని అన్నారు. గ్రామంలో సమస్యలు లేకుండా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రజలు ఆదరించి సర్పంచ్ గా గెలిపిస్తే పాలకులుగా కాకుండా సేవకునిగా పనిచేస్తారని తెలిపారు. గ్రామ అభివృద్ధి ప్రజాసేవే లక్ష్యంగా సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని ఇందుకు ప్రజలందరూ సహకరించి బ్యాట్ గుర్తుకు ఓటు వేసి గెలిపిస్తారని కోరుతున్నానని తెలిపారు. ప్రజల ఆశీర్వాదమే నా గెలుపుకు నిదర్శనమని అన్నారు. గ్రామాన్ని అని రంగాలలో అభివృద్ధి చేసి మండలంతో పాటు జిల్లా రాష్ట్రంలో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు అందరి సహకారంతో కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు యువకులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వాములకు అన్నదానం



**సూర్యాపేట, విశాలాభారతి :** అయ్యప్పలకు అన్నదానం మహాభాగ్యం అని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ ఊర రామ్మూర్తి యాదవ్ అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న అయ్యప్ప స్వామి దేవాలయంలో డాక్టర్ ఊర రామ్మూర్తి, గాయత్రి పెళ్లిరోజు సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. మాలధారణ చేసిన అయ్యప్ప భక్తులు కఠిన నియమలతో దీక్ష చేస్తారు అని అన్నారు. ఉదయాష్టమ సంధ్యలలో స్వామికి పూజలు చేస్తూ ఏకభుక్తం తింటూ 41 రోజుల పాటు దీక్షను కొనసాగిస్తారు అని తెలిపారు.స్వాములకు అన్నదానం పుణ్యకార్యం అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పది అని మా పెళ్లి రోజు సందర్భంగా స్వాములకు అన్నదానం చేయడం ఎంతో సంతోషంగా ఉంది అని తెలిపారు. ఆధ్యాత్మిక హిందూ పురాణాల ప్రకారం, దానాల్లో ఉత్తమమైన దానం అన్నదానమని పెద్దలు చెబుతారు అని ఒకపూట భోజనం పెట్టి ఆకలితో ఉన్న వారి కడుపు నింపొచ్చు అని ఇతరుల కడుపు నింపడం వల్ల ఎంతో పుణ్యం లభిస్తుందని చాలా మంది నమ్ముతారని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో స్వాములు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ నిమ్మల వెంకన్న, జ్యోతి కరుణాకర్, బైరబోయిన శ్రీనివాస్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు

## రెండేళ్లనుంచి కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి చేసింది శూన్యం

- తీగల దయాకర్ గౌడ్

**జనగామ, విశాలభారతి:** దేవరుప్పుల మండలం, దేవరుప్పుల గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా బిఆర్ఎస్ పార్టీ బలపర్చిన బిఆర్ఎస్ అభ్యర్థి ఏల సుందర్ ప్రచారంలో జోరుమీదున్నాడు.వార్డ్ సభ్యులు,నాయకులు,కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లు,సుమారు వందలమందితో కలిసి వాడవాడకు ప్రతీ ఇంటికి తిరుగుతూ అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ తనకు కేటాయించిన ఉంగురం గుర్తుకు ఓటేసి గెలిపించాలని,గ్రామంలో అభివృద్ధి అంటే ఏంటో చూపిస్తానని, నన్ను భారీ మెజారిటీతో గెలిపించి ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా మండల బిఆర్ఎస్ అధ్యక్షుడు తీగల దయాకర్ గౌడ్ మాట్లాడుతూ అధికారంలోకి రాకముందు అదిచేస్తాం,ఇదిచేస్తామని కల్లబొల్లి మాటలు చెప్పి ఇప్పుడు అధికారంలోకి వచ్చి రెండేళ్ళైనా అభివృద్ధి కాలేదని,మీరు అమలుపరచిన హామీలు ఏమయ్యాయని ప్రజలు మిమ్మల్ని నిలదీస్తారని,బిఆర్ఎస్ పార్టీనే ప్రజలు ఆదరిస్తున్నారని,ఎక్కడికి వెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని,బిఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి ఏల సుందర్ ఉంగురం గుర్తుకు ఓటేసి గెలుపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా,మండల నాయకులు,గ్రామ నాయకులు,యువజన నాయకులు,సోషల్ మీడియా నాయకులు ,కార్యకర్తలు,మహిళా నాయకురాళ్లు, తదితరులు పాల్గొన్నారు.

## నిజామాబాద్‌లో ప్రశాంతంగా ప్రారంభమైన పోలింగ్



**నిజామాబాద్, విశాలభారతి:** నిజామాబాద్ జిల్లాలో మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ ఉదయం 7.00 గంటలకు ప్రశాంతంగా ప్రారంభమయ్యింది. వణికించే చలిని సైతం లెక్క చేయకుండా ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం నుండే ఓటర్లు బారులు తీరారు.జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి ఎడపల్లి మండలం జానకంపేట, ఎం.ఎస్.సీ ఫారంలలో పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటింగ్ తీరును, పోలింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. కలెక్టర్ వెంట అదనపు డీసీపీ బస్వారెడ్డి, ఇతర అధికారులు ఉన్నారు.

## సోంపల్లిలో కాంగ్రెస్ ఘన విజయం

- పైలెట్ ప్రాజెక్టు ముందు ప్రతిపక్షం పరార్
- నూతన సర్పంచ్ గా తాటి లక్ష్మి
- మార్పు కావాలి కాంగ్రెస్ రావాలి





**బూర్గంపాడు, విశాలభారతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సోంపల్లి గ్రామపంచాయతీలో మొదటిదప స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తాటి లక్ష్మి,భర్త వీరాంజనేయులు ఘన విజయం సాధించగా 8 వార్డులకు గాను 7వార్డులు కాంగ్రెస్ కైవసం చేసుకుంది. 2వ వార్డ్ బిఆర్ఎస్ అభ్యర్థి గెలుపొందారు. కాంగ్రెస్ విజయకేతనం ఎగరవేయడంతో సోంపల్లిలో పండుగ వాతావరణం నెలకొంది. మార్పు కావాలి కాంగ్రెస్ రావాలి అన్న నినాదం ప్రజల్లో బలంగా నాటుకుంది. సంక్షేమ పథకాల అభివృద్ధి, ఇందిరమ్మ ఇళ్లు పైలెట్ ప్రాజెక్టు ఉన్న నేపథ్యంలో సోంపల్లి ప్రజల నోట కాంగ్రెస్ మాట రావడం విశేషం. కాంగ్రెస్ కంచుకోటగా సోంపల్లి నాంది పలికింది. స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు పట్ల హర్షం వ్యక్తం చేశారు. తాటి లక్ష్మి గెలుపుకి సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు ఆమె తెలిపారు.

## తెలంగాణ జాగృతి కొత్తగూడెం ఇన్‌చార్జీగా జగదీశ్

- నియమించిన జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



**కొత్తగూడెం, విశాలభారతి:** తెలంగాణ జాగృతి కొత్తగూడెం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్ చార్జీగా నమ్మి జగదీశ్ ను జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత నియమించారు. తెలంగాణ జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి ఈ విషయాన్ని ఒక ప్రకటనలో వెల్లడించారు. తెలంగాణ జాగృతి ఐటీ విభాగం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన సముద్రాల క్రాంతి కుమార్ ను నియమించారు. వీరి నియామకాలు వెంటనే అమలులోకి వస్తాయని ప్రకటించారు.

## ఎన్నికలవేళ ప్రతిష్టమైన బందోబస్తు

- పోలింగ్ సరళిని పరిశీలించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు



**భద్రాద్రి కొత్తగూడెం, విశాలభారతి:** ఏడు గంటల నుంచి ప్రారంభమైన పోలింగ్ నకు సంబంధించి పోలింగ్ కేంద్రాల వద్ద పరిస్థితులను తెలుసుకుంటూ ఆయా పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ సరళిని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పరిశీలించారు.అశ్వాపురం మండలం ఆనందపురం,మణుగూరు మండలం సమితి సింగారం,బూర్గంపాడు మండలం సారపాక ఐటిసి,బిపిఎల్ పాఠశాల,సారపాక మజీద్ రోడ్డు ప్రభుత్వ పాఠశాల అనంతరం భద్రాచలం పంచాయతీలోని ప్రభుత్వ బీఈడీ కళాశాల,నన్నపునేని మోహన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మొదలగు పోలింగ్ కేంద్రాలను పరిశీలించి అక్కడ విధులలో ఉన్న అధికారులకు పలు సూచనలు చేశారు.మొదటి దఫా పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పటిష్టమైన పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయడం జరిగింది.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ అధికారులు,సిబ్బంది సమర్థవంతంగా తమ విధులను నిర్వర్తించడం జరుగుతుందని ఈ సందర్భంగా ఎస్పీ తెలిపారు.

## కాంగ్రెస్ పార్టీ నాయకుడి కుటుంబాన్ని పరామర్శ



**నిజామాబాద్, విశాలభారతి:** ముత్యంపల్లి గ్రామంలోని మాజీ సర్పంచ్ రోడ్డ భాస్కర్ మాతృ మూర్తి పరమపదించారు. వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపిన ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి. ఇంకా ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జిమ్మి రవి, భూపేంద్ర గారు, రాజు భాయ్ గారు, నవీన్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## ఇంటింటా ప్రచారంలో విశేష స్పందన



**దేవరుప్పుల, విశాలభారతి:** గడప గడపకు వెళ్తూ బిఆర్ ఎస్ అభ్యర్థిని గెలిపించాలని ప్రజలను కోరిన బిఆర్ఎస్ జనగామ జిల్లా నాయకులు బబ్బూరి శ్రీకాంత్ గౌడ్దే వరుప్పుల మండలం, పెద్దమాడుర్ గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి పానుగంటి గిరి గెలుపుకై ఇంటింటా ప్రచారం నిర్వహించిన బిఆర్ ఎస్ జిల్లా నాయకులు బబ్బూరి శ్రీకాంత్ గౌడ్. ప్రచారం ముందు బ్రేక్ ఫాస్ట్ అందరితో కలిసి చేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను విస్మరించినందున స్థానిక ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల కష్టాలు అన్ని ఇన్ని కావు, ఇప్పటికీ వరకు రైతు బరోసా కానీ, రైతు రుణమాఫీ కానీ, యూరియా తిప్పలు వంటివి అనేక్ ఇబ్బందులు ఉన్నాయి. స్థానిక ఎన్నికల్లో బిఆర్ ఎస్ పార్టీ అభ్యర్థిని గెలిపిస్తే పెద్ద మాడుర్ గ్రామానికి కావాల్సిన వసతులు కల్పించే బాధ్యత అని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పెద్ద మాడుర్ గ్రామ బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## దేవరుప్పుల మండలంలో పోటాపోటీ హోరాహోరీ





**దేవరుప్పుల, విశాలభారతి:** మండలం సింగరాజుపల్లి గ్రామంలో సర్పంచ్ పదవికి బిఆర్ఎస్ నుండి (కత్తుల రమసోమిరెడ్డి) కాంగ్రెస్ నుండి (కొండ ఊర్మిళమల్లారెడ్డి) మధ్య హోరాహోరీ పోటీ నెలకొంది రెండు పార్టీల అభ్యర్థులు గ్రామంలో ఇంటింటి ప్రచారాన్ని వేగవంతం చేస్తూ ప్రజల్లో జోష్ నింపుతున్నారు. ప్రచారంలో పాల్గొన్న మహిళలు అధిక సంఖ్యలో అభ్యర్థులను ఆత్మీయంగా ఆహ్వానిస్తూ, గ్రామ అభివృద్ధి కోసం తమ వంతు మద్దతు ఇస్తామని తెలిపారు. ప్రజల ముందు మాట్లాడిన బిఆర్ఎస్ అభ్యర్థి రమ సోమిరెడ్డి గ్రామంలో గ్రామస్తులకు కావలసిన పనులు గ్రామ అభివృద్ధి,బసంక్షేమం పథకాల అమలులో ఎలాంటి రాజీ ఉండదు, కత్తెర గుర్తుకు మీ విలువైన ఓటు వేయండి అని కోరారు. కాంగ్రెస్ అభ్యర్థి (ఊర్మిళ మల్లారెడ్డి) మాట్లాడుతూ, గ్రామంలో ఎవరైనా సమస్య చెప్పండి తక్షణమే స్పందిస్తాను, ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాను ఉంగరం గుర్తు మీద ఓటు వేసి గెలిపించండి, గ్రామ అభివృద్ధిని వేగవంతం చేస్తాం అని హామీ ఇచ్చారు. రెండు పార్టీల అభ్యర్థులు గ్రామ ప్రజలకు నమస్కారాలు తెలుపుతూ, అభివృద్ధి సేవలు సేవలు కోసం తమకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు ప్రచారం జరుగుతోంది.

## నాచారం అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తా

- **ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**



**నాచారం , విశాలభారతి:** నాచారం డివిజన్ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం నాచారంలో 68 లక్షల రూపాయల సిమెంటు రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.ఈఎస్ఐ హాస్పిటల్ ఎదురుగా ఉన్న వీధిలో క్రియేటివ్ నివాస్ అపార్ట్మెంట్ దారిలో 25 లక్షల రూపాయల వ్యయంతో సిమెంట్ రోడ్డు నిర్మాణం శ్రీ రాఘవేంద్ర నగర్ ఎంట్రన్స్ లో 10 లక్షల రూపాయల వ్యయంతో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు స్థానిక కార్పొరేటర్ శాంతి సాయి జెన్ శేఖర్ తో కలిసి శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ గ్రేటర్ నాయకులు సాయి జెన్ శేఖర్, డి ఈ బాలకృష్ణ, వర్క్ ఇన్స్పెక్టర్ విజయ్ కాలనీ వాసులు , బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


## పంచాయతీ ఎన్నికలపై గూడూరులో ఎస్పీ పర్యవేక్షణ



**మహబూబాబాద్, విశాలభారతి:** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలోని 41 గ్రామపంచాయతీ లకు సంబంధించి తొలి విడత ఎన్నికలు ఈ రోజు ఉదయం 7 గంటలకు సమయానికి ప్రారంభమై, గ్రామాల ప్రజలు కుటుంబ సమేతంగా పెద్ద సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ప్రజాస్వామ్య హక్కు వినియోగించుకోవాలనే ఉత్సాహం ఓటర్లలో స్పష్టంగా కనిపించింది. ఎన్నికల పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించడానికి మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్ స్వయంగా గూడూరు మండలంలో పర్యటించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు ఆయన వెల్లడించారు. చిన్నతప్పిండి కూడా జరగకుండా ముందస్తుగా అన్ని చర్యలు పూర్తి చేసినట్టు తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద బలగాలను పెంచి, అప్రమత్తంగా ఉండాలని అధికారులకు, సిబ్బందికి ప్రత్యేకంగా సూచనలు ఇచ్చారు. అదనపు బలగాలను మోహరించడం ద్వారా ప్రజలు భయభ్రాంతులు లేకుండా, స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునే వాతావరణాన్ని కల్పించినట్టు చెప్పారు. అదనంగా, ప్రతి పోలింగ్ కేంద్రాన్ని అధికారులు నిరంతర పర్యవేక్షణలో ఉంచి, ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే స్పందించేలా ఏర్పాట్లు చేశామని ఎస్పీ డా. శబరీష్ తెలిపారు. గూడూరు మండలంలో మొత్తం ఓటింగ్ ప్రశాంతంగా, శాంతియుతంగా కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు.

## కురవి మండలంలో స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతం

- **టౌన్ ఇన్స్పెక్టర్ గట్ల మహేందర్ రెడ్డి**



**కురవి విశాలభారతి:** మొదటి విడత స్థానిక సంస్థల ఎన్నికల ఓటింగ్ సందర్భంగా కురవి పోలీస్ స్టేషన్ పరిధిలోని తొమ్మిది గ్రామాల్లో కట్టుదిట్టమైన భద్రతా వ్యవస్థను అమలు చేస్తూ ఇంచార్జ్ అధికారిగా ఉన్న మహబూబాబాద్ టౌన్ ఇన్స్పెక్టర్ గట్ల మహేందర్ రెడ్డి విశేష సేవలు అందించారు. తన పరిధిలోని ప్రతి పోలింగ్ కేంద్రాన్ని పర్యవేక్షిస్తూ సిబ్బంది బాధ్యతలను స్వయంగా పరిశీలించారు. ఓటర్లు ఎటువంటి భయం లేకుండా తమ ఓటు హక్కును వినియోగించే వాతావరణం నెలకొనేలా ముందస్తు చర్యలను చేపట్టి, గ్రామాల మధ్య రవాణా, ప్రజల రాకపోకలు అడ్డంకులు లేకుండా పర్యవేక్షించారు. అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా చుట్టుప్రక్కల ప్రాంతాల్లో అదనపు సిబ్బందిని మోహరించడం, సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టడం వంటి చర్యలతో ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేలా తన వంతు పాత్రను ప్రతిబింబించారు. గ్రామస్థులు, పోలింగ్ సిబ్బంది ఇన్స్పెక్టర్ గట్ల మహేందర్ రెడ్డి తీసుకున్న జాగ్రత్తలను అభినందిస్తూ ప్రశాంత వాతావరణం నెలకొనేలా చేసిన కృషిని పొగడ్తలతో కొనియాడారు.

# నిరుపేద విశ్వకర్మలకు అండగా ఉంటాం

- **ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

**నాచారం, విశాలభారతి:** విశ్వకర్మ ట్రస్ట్ వార్షికోత్సవంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, క్యాలెండర్ ఆవిష్కరించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి. విశ్వకర్మలు ఆర్థికంగా వెనుకబడి ఉన్నారని, వారి ఎదుగుదలకు అన్ని విధాల అండగా నిలుస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఉప్పల్ నియోజకవర్గ ఆపరా సర్కిల్ పరిధిలోని డాక్టర్ ఏఎస్ రావు నగర్ డివిజన్ జై జవాన్ కాలనీ మారుతి నగర్ లో విశ్వకర్మ ట్రస్ట్ వారు నిర్మించిన విశ్వకర్మ ట్రస్ట్ భవన్ వార్షికోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా విశ్వకర్మ ట్రస్ట్ చైర్మన్ కలకొండ బిక్షపతి చారి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన నూతన సంవత్సర క్యాలెండర్ను ఆవిష్కరించారు. తలదాత విశ్వకర్మ ట్రస్ట్ చైర్మన్ మారోజు నరసింహ చారి జన్మదినం సందర్భంగా ఆయనను సన్మానించారు. ట్రస్టు ప్రధాన సలహాదారులు విశ్వకర్మ ట్రస్ట్ సభ్యులు వడ్లోజు జ్యోతిర్మయా చారి, ప్రధాన కార్యదర్శి మహంకాళి నరసింహ చారి, కోశాధికారి అందోజు రామాచారి ల సమక్షంలో, పురోహితరత్నాల్ల బండి లంకేశ్వర చారి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. క్యాలెండర్ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వకర్మ నిరుపేదలైన వారికి విద్యార్థి పరంగా ఆరోగ్యపరంగా ఇటువంటి అవసరాలు ఉన్న దాని అండగా నిలుస్తానని పేర్కొన్నారు కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రభుదాస్, శత్రఘ్నచారి, విష్ణు సాయి ప్రసాద్, గట్టోజు రాము,గుంటోజు శ్రీనివాస్ చారి పాల్గొన్నారు.



## కాలనీవాసుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం



- **కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి**

**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్:** హయత్‌నగర్ డివిజన్‌లోని సిద్ధి వినాయక కాలనీ వాసులు తమ కాలనీలో కొనసాగుతున్న సమస్యలను వివరించేందుకు గురువారం స్థానిక కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డిని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా కాలనీ వాసులు ఇటీవల పూర్తయిన ప్రధాన రహదారి సీసీ రోడ్డు నిర్మాణ పనులపై సంతోషం వ్యక్తం చేస్తూ, కార్పొరేటర్ నవజీవన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే కాలనీలోని పలు వీధుల్లో సీసీ రోడ్ల నిర్మాణం, మంచినీటి పైప్‌లైన్ల ఏర్పాటు, మరిన్ని విద్యుత్ వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు.కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ — హయత్‌నగర్ డివిజన్ అభివృద్ధి తమ ప్రధాన లక్ష్యమని,గత నాలుగున్నర సంవత్సరాల్లో డివిజన్‌లో ఎన్నడూ లేని స్థాయిలో అభివృద్ధి పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ, డివిజన్ మరింత పురోగతి సాధించేలా కృషి చేస్తామని,కాలనీవాసులు సూచించిన సమస్యలను సంబంధిత శాఖల దృష్టికి తీసుకెళ్లి, త్వరితగతిన పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిద్ధి వినాయక కాలనీ వాసులు దుర్గాప్రసాద్, లక్ష్మారెడ్డి, లక్ష్మీనారాయణ, భీమ్‌రాజ్, లింగం, చరణ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలి

**జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్ వి కర్ణకు వినతి**

**నాచారం, విశాలభారతి:** మల్లాపూర్ డివిజన్ పరిధిలోని గ్రీన్ హిల్స్ కాలనీలో రూపాయలు 1.63 కోట్లు, జనప్రియ ,భవాని నగర్ కాలనీలో బాక్స్ డ్రైన్ పనులకు రూ.2 కోట్లు, మల్లికార్జున కాలనీలో రూపాయలు 85 లక్షల వ్యయంతో చేపట్టబోయే పెండింగ్ పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ.జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్ వి కర్ణను మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి కలిసి వినతి పత్రం అందజేశారు. త్వరితగతిన నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేయాలని కమిషనర్ను కార్పొరేటర్ కోరారు. దీనికి జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్ వి.కర్ణ సానుకూలంగా స్పందించి ప్రతిపాదనలను సిఈకి పంపాడు.



## ఫుట్‌బాల్ ఆడుతున్నా రండి..!

**( మొదటిపేజీ తరువాయి )**



గురించి మాట్లాడినట్లు సమాచారం. ఈ నెల 13న ఉప్పల్ స్టేడియంలో జరిగే ఫుట్ బాల్ మ్యాచ్‌లో మెస్సీ, సీఎం రేవంత్‌రెడ్డి, అంతర్జాతీయ ఫుట్ బాల్ క్రీడాకారులు పాల్గొంటున్నారు. మెస్సీ పర్యటన, ప్రముఖుల రాక నేపథ్యంలో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లపై చర్యలు చేపట్టారు. ఈనెల 13వ తేదీ శనివారం రోజున సాయంత్రం 4 గంటలకు లియోనల్ మెస్సీ శంషాబాద్ ఎయిర్ పోర్ట్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి బయలుదేరి ఫలక్‌నుమా ప్యాలెస్‌లో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. తర్వాత ఉప్పల్ స్టేడియంలో ఏర్పాటు చేసిన మ్యాచ్‌కు హాజరవుతారు. కేవలం ఉప్పల్ స్టేడియం లోనే రాచకొండ కమిషనరేట్‌కు సంబంధించిన పోలీసులు సుమారు 2వేల మందితో భారీ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. భద్రత ఏర్పాట్లలో పోలీసులకు అదనంగా స్టేడియం లోపల వెయ్యి మంది వాలంటీర్లు డ్యూటీలో ఉంటారు. శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఫలక్‌నుమా ప్యాలెస్, ఉప్పల్ స్టేడియం వరకు ప్రయాణించే మార్గాలు ఇప్పటికే ఫైనల్ అయ్యాయి. 13వ తేదీ రాత్రి కూడా ఫలక్‌నుమా ప్యాలెస్‌లోనే మెస్సీ బస చేస్తారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే ప్యాలెస్ పరిసరాలను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రస్తుతం ఫలక్‌నూమా ప్యాలెస్‌ను తాజ్ హోటల్స్ యాజమాన్యం నిర్వహిస్తోంది.

## ఓటు వేసి గెలిపిస్తే గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా

- **ప్రతి ఒక్కరికీ నాణ్యమైన విద్య అందే విధంగా కృషి**
- **కల్కొడ కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి చెక్క రాణి సుభాష్**



**విశాలభారతి, మర్పల్లి:** ప్రజలు ఆదరించి, రింగు గుర్తుకి తమ అమూల్యమైన ఓటు వేసి గెలిపిస్తే గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని అభివృద్ధి సంక్షేమమే ప్రధాన ఏంజెండా ముందుకు సాగుతానని కాంగ్రెస్ పార్టీ బలపరిచిన కల్కొడ సర్పంచ్ అభ్యర్థి చెక్క రాణి సుభాష్ అన్నారు. మండలంలోని కల్కొడ గ్రామంలో గురువారం స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..గ్రామప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో స్థానిక ఎన్నికల్లోకి సర్పంచ్ అభ్యర్థిగా నిలబడినట్టు తెలిపారు. మహిళలు, యువకులు, విద్యార్థుల సమస్యలు పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ, తాగునీరు, వీధిలైట్లు, పారిశుద్ధం తో పాటు , గ్రామాన్ని ఆహ్లాదరకంగా తీర్చిదిద్దుతానని హామినిచ్చారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా ముందుండి పరిష్కరిస్తానన్నారు. విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రతి ఒక్కరికి చదువుకునే విధంగా ప్రోత్సహిస్తామన్నారు. విద్యావంతురాలుగా ఎంతోమంది విద్యార్థులు తీర్చిదిద్దానని గ్రామాన్ని కూడా ఆదర్శంగా గ్రామంలో తీర్చిదిద్దామని ఓటర్లు అందరూ ఉంగరం గుర్తుకు ఓటేసి, గెలిపించాలని ఆమె కోరారు.

## మంత్రి కొండా సురేఖకు
# నాన్ బెయిలబుల్ వారెంట్

**( మొదటిపేజీ తరువాయి )**



మంత్రి కొండా సురేఖ విమర్శలు చేసే క్రమంలో.. నాగచైతన్య, సమంత విడాకులపై తీవ్ర అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. ఇవి వివాదాస్పదమైనాయి. దీనిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నాంపల్లిలోని ప్రత్యేక కోర్టును ఆశ్రయించారు. ఎలాంటి ఆధారాలు లేకుండా తనపై ఆరోపణలు చేశారంటూ.. తన పరువుకు నష్టం కలిగించేలా మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలు చేశారంటూ ఆయన కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. గతంలో తాను మంత్రిగా పని చేశానని.. పార్టీకి కార్యనిర్వాహక అధ్యక్షుడి ఉన్నానని ఆయన కోర్టుకు తెలిపారు. ఈ కేసు విచారణలో భాగంగా సాక్షులుగా ఉన్న బీఆర్ఎస్ పార్టీ నేతలు బాల్కా సుమన్, సత్యవతి రాథోడ్, తుల ఉమ, దాసోజ్ శ్రవణ్ స్టేట్‌మెంట్లను సైతం కోర్టు రికార్డు చేసింది. కోర్టులో ఈ కేసు విచారణ ప్రస్తుతం కొనసాగుతోంది.

ఇక మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలను హీరో అక్కినేని నాగార్జున తప్పు పట్టారు. కొండా సురేఖపై పరువు నష్టం దావా వేశారు. కొండా సురేఖ చేసిన వ్యాఖ్యల వీడియో క్లిప్పింగ్స్, సోషల్ మీడియా లింక్స్‌తో కలిపి నాంపల్లిలోని ప్రత్యేక కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తమ కుటుంబ పరువు ప్రతిష్టకు భంగం కలిగించేలా కొండా సురేఖ వ్యాఖ్యలు చేశారని.. చట్టపరమైన క్రిమినల్ చర్యలతోపాటు పరువునష్టానికి సంబంధించి బీఎస్ఎస్ 356 కిద చర్యలు తీసుకోవాలని కోర్టును కోరారు. అయితే ఇటీవల మంత్రి కొండా సురేఖ.. హీరో నాగార్జునకు క్షమాపణలు చెప్పారు. దాంతో ఈ కేసును హీరో నాగార్జున ఉపసంహరించుకున్న సంగతి తెలిసిందే.

కొద్ది రోజుల క్రితం మంత్రి కొండా సురేఖ, ఫోన్ ట్యాపింగ్ కేసు, డ్రగ్స్ వ్యవహారం, నటి సమంత విడాకుల వివాదం వంటి సున్నితమైన అంశాలలో కేటీఆర్‌పై తీవ్రమైన, నిరాధారమైన ఆరోపణలు చేశారు. ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో పెద్ద దుమారాన్నే లేపాయి. తనపై చేసిన ఆరోపణలు నిరాధారమైనవని, తన పరువుకు భంగం కలిగించేలా ఉన్నాయని భావించిన కేటీఆర్, కొండా సురేఖపై నాంపల్లి కోర్టులో పరువు నష్టం దావా దాఖలు చేశారు.

కేటీఆర్ దాఖలు చేసిన పరువు నష్టం దావాను బీఎన్ఎస్ సెక్షన్ 356 కింద పరిగణనలోకి తీసుకున్న నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టు, కొండా సురేఖపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని పోలీసులను ఆదేశించింది. అంతేకాకుండా.. ఈ నెల 21వ తేదీలోపు నోటీసులు జారీ చేయాలని కూడా సూచించింది. ఈ కేసు విచారణ సందర్భంగా.. మంత్రి కొండా సురేఖ తరపు న్యాయవాదులు కొన్ని అభ్యంతరాలను వ్యక్తం చేశారు. కేటీఆర్ చేసిన ఫిర్యాదు ఊహాగానాల ఆధారంగా ఉందని, సరైన సమాచారం లేదని.. అలాగే ఫిర్యాదు చేసిన పోలీస్ స్టేషన్ పరిధి వంటి అంశాలపై అభ్యంతరాలు లేవనెత్తారు. అయితే.. కోర్టు ఈ అభ్యంతరాలను తోసిపుచ్చింది.

కేటీఆర్ తరపు న్యాయవాది సిద్ధార్థ్ పోగుల, కొండా సురేఖ చేసిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని, పరువుకు భంగం కలిగించేలా ఉన్నాయని బలంగా వాదించారు. ఈ వాదనలతో కోర్టు ఏకీభవించి.. కొండా సురేఖపై క్రిమినల్ కేసు నమోదు చేయవచ్చని తేల్చి చెప్పింది. ఈ తీర్పు తెలంగాణ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. రానున్న రోజుల్లో ఈ కేసు ఎలాంటి మలుపులు తిరుగుతుందో వేచి చూడాలి. రాజకీయ నాయకులు పరువు నష్టం దావాలను ఎదుర్కోవడం కొత్తేమీ కానప్పటికీ.. క్రిమినల్ కేసు నమోదుకు ఆదేశించడం అరుదైన పరిణామంగా చెప్పుకోవచ్చు.

# మరణించినా.. సర్పంచ్‌గా గెలిచాడు

- **రాజన్న సిరిసిల్ల జిల్లా సర్పంచ్ ఎన్నికలల్లో విచిత్రమైన ఘటన**
- **చింతల్ ఠాణాలో సర్పంచ్ ఇటీవల మరణించిన మురళి గెలుపొందారు**
- **300కు పైగా ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు**
- **మరణించడంలో గ్రామస్థులంతా ఆయనకే ఓటు వేశారు**
- **దీంతో ఎన్నికల అధికారులు తర్జనభర్జనలో ఉన్నారు**
- **మరోవైపు 95 ఏళ్ల వయసులో సర్పంచ్‌గా పోటీ చేసి గెలిచారు**



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

రాజన్న సిరిసిల్ల జిల్లా సర్పంచ్ ఎన్నికల ఫలితాల్లో విచిత్రమైన ఘటన వెలుగులోకి వచ్చింది. వేములవాడ అర్బన్ మండలం చింతల్ ఠాణా ఆర్ఆర్ కాలనీ సర్పంచ్‌గా ఇటీవల మరణించిన చర్ల మురళి గెలుపొందారు. ఆయన తన సమీప ప్రత్యర్థిపై సుమారు 300కు పైగా ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. నామినేషన్ అనంతరం మురళి మృతి చెందిన నేపథ్యంలో గ్రామస్థులంతా ఆయనకే ఓటు వేశారు. దీంతో ఎన్నికల అధికారులు తర్జనభర్జనలో ఉన్నారు. వేములవాడ మండలంలోని చింతల్ ఠాణా గ్రామంలో విచిత్రమైన ఘటన జరిగింది. ఈ గ్రామంలో ఇటీవల మరణించిన వ్యక్తికి అధిక ఓట్లు వచ్చాయి. ఐదు రోజుల క్రితం గ్రామానికి చెందిన చర్ల మురళి(53) గుండెపోటుతో ప్రాణాలు కోల్పోయాడు. అయితే అతడు నామినేషన్ తర్వాత మృతి చెందడంతో ఎన్నికల బరిలోనే ఉన్నాడు. చర్ల మురళి మృతి చెందడంతో అతనిపై అభిమానంతో గ్రామస్థులంతా అతనికే ఓటు వేశారు. దీంతో చర్ల మురళికి అధిక ఓట్లు వచ్చాయి. ఈ క్రమంలో అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. ఫలితం ప్రకటించకుండా ఉన్నతాధికారి ఆదేశాల కోసం రిటర్నింగ్ ఆఫీసర్ ఎదురుచూస్తున్నారు. మరోవైపు 95 ఏళ్ల వయసులో సర్పంచ్ గా పోటీ చేసి గెలిచారు గుంటకండ్ల రామచంద్రారెడ్డి. సూర్యాపేట జిల్లా నాగారం సర్పంచ్ గా ఆయన ఎన్నికయ్యారు. మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి తండే రామచంద్రారెడ్డి. మరో ఘటనలో రంగారెడ్డి జిల్లా కొందుర్గ్ మండలం చిన్న ఎల్కచెర్ల గ్రామంలో ఇద్దరు అభ్యర్థులకు సమానమైన ఓట్లు వచ్చాయి. దీంతో రీ కౌంటింగ్ నిర్వహించారు అధికారులు. రీ కౌంటింగ్ లోనూ సమానమైన ఓట్లు రావడంతో టాస్ వేసి సర్పంచ్ ను నిర్ణయించారు. ఇదిలాఉంటే వికారాబాద్ జిల్లా కొండగల్ మండలం ఖాజాహైమద్ పల్లి గ్రామంలో షాకింగ్ ఘటన జరిగింది. సర్పంచ్ ఎన్నికల్లో ఓటమి తట్టుకోలేక ఓ మహిళా అభ్యర్థి ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం ఆమెను ఆసుపత్రికి తరలించారు. ఇక తెలంగాణలో తొలి దశలో మొత్తం 4, 236 పంచాయతీలకు ఇప్పటివరకూ 3332 సీట్లలో కౌంటింగ్ పూర్తయింది. ఈ ఫలితాల్లో అధికార కాంగ్రెస్ 1840 పంచాయతీల్లో విజయం సాధించింది. అలాగే బీఆర్ఎస్ 930 పంచాయతీల్లో విక్టరీ కొట్టింది. బీజేపీ 151 స్థానాల్లో విజయం సాధించింది. ఇక ఇతరులు 414 స్థానాల్లో గెలుపొందారు. ఇక తెలంగాణలో తొలి విడత పంచాయతీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. 3,834 గ్రామాల్లో సర్పంచ్ అలాగే 27,678 మంది వార్డు సభ్యుల స్థానాలకు పోలింగ్ జరిగింది. తొలి విడత పంచాయతీ ఎన్నికల్లో 79.15 శాతం పోలింగ్ నమోదైంది. అత్యధికంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో 87.93 శాతం పోలింగ్ నమోదు అయింది. అలాగే మెదక్ జిల్లాలో 86 శాతం.. వరంగల్ జిల్లాలో 81.2 శాతం పోలింగ్ జరిగింది. ఇక హన్మకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం ఆరేపల్లిలో సర్పంచ్ ఎన్నికల ఓట్ల లెక్కింపు తీవ్ర ఉత్కంఠను రేపింది. అభ్యర్థి స్రవంతి కేవలం 4 ఓట్ల తేడాతో విజయం సొంతం చేసుకుంది. అలాగే కామారెడ్డి జిల్లా బిక్కనూర్ మండలం ర్యాగట్లపల్లిలో భాగ్యమ్మ అనే సర్పంచ్ అభ్యర్థి కూడా కేవలం 5 ఓట్లతో గెలుపొందింది. అలాగే మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండలం చీన్యా తండాలో బీఆర్ఎస్ బలపరిచిన జాటోత్ హరిచంద్ 9 ఓట్లతో విజయం సాధించాడు. నల్గొండ జిల్లా మద్దిరాల మండలం తూర్పు తండాలో ఒక్క ఓటుతో విజయం సాధించాడు. బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థి భూక్య వీరన్న ప్రత్యర్థిపై ఒక్క ఓటుతో విజయం సాధించాడు. మరోవైపు కోరుట్ల మండలం తిమ్మయ్యపల్లెలో తల్లిపై కాంగ్రెస్ అభ్యర్థి గెలుపొందారు. కాంగ్రెస్ అభ్యర్థి పల్లపు సుమలత ఆమె తల్లి గంగవ్వపై 91 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు.

## ముల్లంగి గ్రామంలో విస్తృత పర్యటన

**నిజామాబాద్, విశాలభారతి:**

నిజామాబాద్ జిల్లా విశాల భారతి*ఆర్మూర్ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి మాక్లూర్ మండలం ముల్లంగి గ్రామంలో సర్పంచ్ ఎన్నికల ప్రచారంలో భాగంగా విస్తృతంగా పర్యటించి సర్పంచ్ అభ్యర్థి సల్మాన్ సల్మాన్‌ని కత్తెర గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు మాక్లూర్ మండలంలో ముల్లంగి గ్రామంలో స్థానికసంస్థల ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రామంలోని ఓటర్ మహాశయులను ఆత్మీయంగా కలుస్తూ గ్రామ అభివృద్ధి కొరకై అహర్నిశలు శ్రమించి గ్రామ ప్రజల సుఖసంతోషాల కొరకై పాటుపడుతూ అనునిత్యం ప్రజల బాగోగుల కొరకై పాటుపడే కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సల్మాన్ గారికి మీ అమూల్య ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో భాగంగా వినయ్ కుమార్ రెడ్డి గారు మాట్లాడుతూ ముల్లంగి గ్రామ అభివృద్ధికి నిధులు ఇప్పిస్తానని డ్రైనేజీ , రోడ్ల అభివృద్ధికి సహకరిస్తానని 98 ఇందిరమ్మ ఇల్లు పైలెట్ ప్రాజెక్టు కింద ఇప్పించానని ఇంకా ఇప్పిస్తానని, అంతేకాకుండా ముల్లంగి గ్రామపంచాయతీ అభివృద్ధికై ప్రభుత్వ నిధులు 10 లక్షలు కేటాయిస్తామని ముల్లంగి గ్రామవాసుల సమక్షంలో ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి సల్మాన్‌కి అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో భాగంగా




మాక్లూర్ మండల కాంగ్రెస్ ప్రెసిడెంట్ రవి ప్రకాష్, మాకూర్ సొసైటీ చైర్మన్ అశోక్ ముల్లంగి గ్రామ కాంగ్రెస్ సీనియర్ నాయకులు, ప్రజలు మహిళలు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.




# లేడీ మాఫియా డాన్ పాత్రలో..

అగ్ర కథానాయిక కాజల్ అగర్వాల్ తెలుగులో తొలిసారి వెబ్‌సిరీస్‌లో నటిస్తున్నట్లు తెలిసింది. 'విశాఖ' పేరుతో తెరకెక్కిస్తున్న ఈ సిరీస్‌కు సుధీర్‌వర్మ దర్శకత్వం వహిస్తున్నట్లు సమాచారం. హిందీలో సుస్మితాసేన్ నటించిన 'ఆర్య' వెబ్‌సిరీస్‌కు రీమేక్ ఇదని అంటున్నారు. ఇందులో కాజల్ అగర్వాల్ మాఫియా డాన్ పాత్రను పోషిస్తున్నట్లు తెలిసింది.నగరంలో ఓ మాఫియా డాన్ ప్రత్యర్థుల చేతిలో హత్యకు గురవుతాడు. వారిపై ప్రతీకారం తీర్చుకునేందుకు ఆయన భార్య మాఫియా డాన్‌గా అవతారమెత్తుతుంది. ఈ నేపథ్యంలో చోటుచేసుకునే సంఘటనల నేపథ్యంలో సాగే కథాంశమిది. తెలుగులో కాజల్ అగర్వాల్ నటిస్తున్న తొలి వెబ్‌సిరీస్ ఇదే కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ ఏడాది 'కన్నప్ప' చిత్రంలో అతిథి పాత్రలో మెరిసింది కాజల్ అగర్వాల్. ప్రస్తుతం ఈ భామ హిందీలో 'రామాయణ' సిరీస్ చిత్రాలతో పాటు 'ది ఇండియన్ స్టోరీ' అనే చిత్రంలో నటిస్తున్నది.

# విరామం లేని ప్రయాణం

బాలీవుడ్ నటి ప్రియాంక చోప్రా హాలీవుడ్‌లోనూ వరుసగా సినిమాలు చేస్తూ ప్రపంచనటిగా గుర్తింపు తెచ్చుకున్నది. ప్రస్తుతం టాలీవుడ్ ప్రతిష్టాత్మక పాన్ వరల్డ్ మూవీ 'రాజమౌళి వారణాసి'లో కథానాయికగా నటిస్తూ బిజీగా ఉన్న ప్రియాంక.. తాను అనుభవిస్తున్న ఈ స్టార్‌డమ్ వెనుక పడిన కష్టాన్ని తన తాజా ఇంటర్వ్యూలో గుర్తు చేసుకున్నది. 'పరిశ్రమకి వచ్చిన కొత్తలో సినిమాలపై నాకేమాత్రం అవగాహన ఉండేది కాదు. 'మిస్ వరల్డ్' అవ్వడంతో అవకాశాలు మాత్రం వరుస కట్టేవి.అవి రావడమే అదృష్టంగా భావించేదాన్ని. దాంతో వచ్చిన ప్రతి సినిమాకూ సంతకం చేసేదాన్ని. అస్సలు విరామం ఉండేది కాదు.



# సెన్సార్ బోర్డుకి 'మోగ్లీ' మేకర్స్ క్షమాపణలు..

టాలీవుడ్‌లో తెరకెక్కిన లేటెస్ట్ ఫారెస్ట్ బ్యాక్‌డ్రాప్ రొమాంటిక్ డ్రామా చిత్రం 'మోగ్లీ' ఇప్పటికే అన్ని పనులు ముగించుకుని రిలీజ్‌కు రెడీ అయింది. ఈ సినిమాను దర్శకుడు సందీప్ రాజ్ డైరెక్ట్ చేయగా రోషన్ కనకాల, సాక్షి మదోల్కర్ హీరోహీరోయిన్లుగా నటించారు. ఈ సినిమాలో బండి సరోజ్ కుమార్ విలన్ పాత్రలో నటిస్తున్నారు. ఇక ఈ సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్‌ను మేకర్స్ ఘనంగా నిర్వహించగా, ఆ ఈవెంట్‌లో నటుడు బండి సరోజ్ చేసిన కామెంట్స్ కొత్త వివాదానికి దారి తీశాయి.మోగ్లీ చిత్రంలో బండి సరోజ్ రూత్‌లెస్ కాప్ పాత్రలో నటిస్తున్నాడని.. ఆయన పర్ఫార్మెన్స్ ఈ సినిమాకే హైలైట్‌గా ఉండనుందని చిత్ర యూనిట్ చెబుతోంది. కాగా, తన పాత్రను చూసి సెన్సార్ బోర్డు భయపడిందని.. ముఖ్యంగా తన పర్ఫార్మెన్స్ చూసి ఓ సెన్సార్ ఆఫీసర్ భయపడిపోయాడని.. అందుకే ఈ సినిమాకు A సర్టిఫికెట్ జారీ చేశారని బండి సరోజ్ కామెంట్ చేశాడు.





# చల్లగాలి కావాలంటే చందమామను తీసుకొస్తాడే..

అగ్ర కథానాయకుడు రవితేజ ప్రధాన పాత్ర పోషిస్తున్న వినోదాత్మక కుటుంబకథాచిత్రం 'భర్తమహాశయులకు విజ్ఞప్తి'. అషికా రంగనాథ్, డింపుల్ హయాతి కథానాయికలు. కిశోర్ తిరుమల దర్శకుడు. సుధాకర్ చెరుకూరి నిర్మాత. సంక్రాంతి కానుకగా చిత్రం విడుదల కానున్నది. ఈ సందర్భంగా ప్రచారం వేగవంతం చేశారు. ఇప్పటికే తొలి పాట 'బెల్లా బెల్లా..' ప్రేక్షకులను ఆకట్టుకున్నదని చిత్రబృందం ఆనందం వ్యక్తం చేస్తున్నది. ఈ క్రమంలో బుధవారం రెండో పాటను విడుదల చేశారు.'చల్లగాలి కావాలంటే చందమామను తీసుకొస్తాడే.. సన్నజాజీ కావాలంటే సంత మొత్తం మోసుకొస్తాడే.. అడిగింది అందిస్తాడే.. అంతకు మించింది తెచ్చిస్తాడే.. కోరింది తీరుస్తాడే.. వేరే కోరిక నాకింక లేకుండా చేస్తాడే.. అద్దం ముందు నిలబడి.. అబద్ధం చెప్పలేనే.. నా అద్దం అంటే నువ్వేమరీ.. ఆ నిజం దాచలేనే..' అంటూ చంద్రబోస్ రాసిన అద్భుతమైన సాహిత్యాన్ని భీమ్స్ సిసిరోలియో స్వరపరచగా, శ్రేయా ఘోషల్, కపిల్ కపిలన్ కలిసి ఆలపించారు. శ్రావ్యమైన రాగంతో, ఆహ్లాదకరమైన చిత్రణతో ఈ పాట సాగింది. పాటకు తగినట్టుగా రవితేజ, డింపుల్ హయాతి అందంగా అభినయించారు. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: ప్రసాద్ మూరెళ్ల.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No - APTEL/2010/32877.